RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 145 ISSUE NO : 145 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం,నవంబర్,29,2025 Saturday,November,29,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



బహుభార్యత్వానికి

## పదేళ్ల జైలు

### అసోంలో కొత్త చట్టం

అసోం: అసోంలో బహుభార్యత్వాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఇకపై పురుషులు ఒకరి కంటే ఎక్కువ మంది వివాహం చేసుకోవడం రాష్ట్రంలో నేరంగా పరిగణించబడుతుంది. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారికి గరిష్ఠంగా పదేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించేలా కొత్త చట్టంలో నిబంధనలు పొందుపరిచారు. ఈ చట్టంపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ శాసనసభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. బహుభార్యత్వ నిషేధ చట్టం కేవలం ఇస్లాం మతానికి వ్యతిరేకంగా తెచ్చింది కాదని, ఇది అన్ని మతవర్గాలకూ సమానంగా వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో మహిళల హక్కులను పరిరక్షించేందుకే ఈ నిర్ణ యం తీసుకున్నట్లు తెలిపారు. అయితే, ఈ చట్టానికి ప్రభుత్వం కొన్ని మినహాయింపులు కూడా కల్పించింది. రాజ్యాంగంలోని ఆరో షెడ్యూ ల్ పరిధిలోని ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) వారికి ఈ చట్టం వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాజిక సంస్కరణల దిశగా ఈ చట్టాన్ని ఒక ముఖ్యమైన అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది.



పంచాయితీ ఎన్నికలకు

## లైన్ క్లీయర్

- ఈ దశలో స్టే విధించలేమని స్పష్టీకరణ
- తామే ఎన్నికలు నిర్వహించాలని..స్టే ఎలా విధిస్తాం
- పిటిషనర్‌ను ప్రశ్నించిన ధర్మాసనం

హైదరాబాద్,తెలంగాణ దిశ : పంచా యతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్ని కలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో- 46పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పినట్లు హైకోర్టు గుర్తు చేసింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ చెప్పుకొచ్చా రు. అయితే, ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకో లేమని మరోసారి స్పష్టం చేసింది. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం. అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు.




ఉడుపితో అనుబంధం

## విడదీయరానిది

### లక్ష కంఠ భగవద్గీత పఠనంలో మోడీ

బెంగళూరు, :ఉడుపి రావడం తనకు చాలా ప్రత్యేకమైంది అని ప్రధాని మోడీ అన్నారు. కర్ణాటకలోని ఉడుపిలో మోడీ పర్యటించారు. అంతకముందు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల నుంచి ప్రజలు పూల వర్షం కురిపించారు. అనంతరం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠానికి వచ్చారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు. జగద్గురు శ్రీ శ్రీ సుగుణెళింద్ర తీర్థ స్వామీజీ విశ్వగీత పర్యాయ.. ప్రధాని మోడీని సత్కరించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఉడుపి జనసంఘ్, భారతీయ జనతా పార్టీకి సుపరిపాలన నమునాకు కర్మభూమిగాపేర్కొన్నారు. 1968లో ఉడుపి ప్రజలు జనసంఘ్ నుంచి వీఎస్.ఆచార్యను మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నుకున్నారని గుర్తుచేశారు. ఉడుపిలో కొత్త పాలనకు ప్రజలు పునాది వేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, సన్యాసులు, పండితులు, వివిధ రంగాలకు చెందిన పౌరులతో భగవత్ గీతను ఏకగ్రీవంగా పారాయణం చేయించారు. ఇక ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలు దగ్గర నుంచి చిత్రాలను సేకరించాలని భద్రతా సిబ్బందిని, పోలీసు సిబ్బందిని మోడీ కోరారు.



థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసల

## నిషేధం

### ట్రంప్ మరో కీలక ప్రకటన..!

వాషింగ్టన్, నవంబర్ 28 : అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పేద దేశాల నుంచి అగ్రరాజ్యానికి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. మరోవైపు, వలసదారులకు అన్నిరకాల ప్రభుత్వ సబ్సిడీలు, ఫెడరల్ బెనిఫిట్స్‌ను కూడా నిలివేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు.అమెరికా సాంకేతికంగా ముందుకెళ్తున్నప్పటికీ.. మన ఇమిగ్రేషన్ విధానం ఆ ప్రయోజనాలను, చాలామంది జీవన పరిస్థితులను దెబ్బతీస్తోంది. అందుకే.. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు వీలుగా.. థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.



సోనియా దయవల్లనే

## తెలంగాణ సాకారం

- ఎస్సీ,ఎస్టీ, బిసి విద్యార్థుల త్యాగాలు మరువలేనివి
- బిసి రిజర్వేషన్ల అంశం ముగియలేదు
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కెసిఆర్ దొంగదీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు.దీక్ష పేరుతోకేసీఆర్ ఎనిమి ది రోజులుఫ్లూయిడ్స్ తీసుకున్నారని..దీక్ష పేరుతో కేసీఆర్ నాటకంచేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చినరిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటిసంగతులను గుర్తుచేశారు. ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు.




కర్ణాటక కాంగ్రెస్‌లో

## కుర్చీ ఫైట్

### సిద్ధూ, డీకే మధ్య మాటల యుద్ధం

బెంగుళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి వివాదం తారస్థాయికి చేరింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. సోషల్ మీడియా వేదికగా ఒకరిపై మరొకరు పరోక్ష విమర్శలు చేసుకుంటూ తమ విభేదాలను బహిర్గతం చేశారు.

దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు ప్రారంభించింది. గురువారం డీకే శివకుమార్ ఎక్స్‌లో చేసిన ఓ పోస్ట్ ఈ వివాదానికి ఆజ్యం పోసింది. 'మాటకు ఉన్న శక్తే ప్రపంచ శక్తి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే ప్రపంచంలో అతిపెద్ద బలం' అని పేర్కొన్నారు.

2023లో ప్రభుత్వం ఏర్పడినప్పుడు కుదిరినట్లుగా చెబుతున్న రెండున్నరేళ్ల అధికార మార్పిడి ఒప్పందాన్ని గుర్తుచేయడానికే ఈ పోస్ట్ పెట్టారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.డీకే పోస్టుకు సిద్ధరామయ్య కూడా అదే తరహాలో ఘాటుగా బదులిచ్చారు. 'ప్రజలకు మంచి చేయనప్పుడు మాటకు శక్తి ఉండదు' అని ఆయన కౌంటర్ ఇచ్చారు.



### ఢిల్లీ కాలుష్యంపై ప్రణాళిక ఏదీ

మోడీపై మరోమారు రాహుల్ విమర్శలు

పార్లమెంటులో చర్చిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ,నవంబర్28 :దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ముప్ప తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నగర వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, పిల్లల పరిస్థితి అయితే మరీ దయనీయంగా మారింది. అనేక ఆరోగ్య సమస్యల తో సతమతం అవుతున్నారు. ఇక ప్రజలు బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం మరింత దారుణంగా తయారైంది.ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఢిల్లీ వాసులు కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఢిల్లీలో జీవించలేక పోతున్నామని వాపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఢిల్లీలో అత్యవసర ఆరోగ్య పరిస్థితిని విధించాలని డిమాండ్ చేశారు.



రంగంలోకి గులాబీ

## బాస్

హైదరాబాద్,తెలంగాణ దిశ : స్థానిక సమరం తెలంగాణ పొలిటికల్ పిచ్‌ను హీటెక్కిస్తోంది. గ్రామాల్లో పార్టీకి పునాదిగా ఉండే లోకల్ బాడీ పోల్స్‌పై రాజకీయ పార్టీలన్నీ సీరియస్ కాన్సన్‌ట్రేషన్ చేశాయి. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంటుంది. బీసీ రిజర్వేషన్లపై అధికార కాంగ్రెస్‌ను ఎండగడుతూనే సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలుచుకోవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్..మాట తప్పి పార్టీపరంగా రిజర్వేషన్లు అంటూ బీసీలకు అన్యాయం చేస్తోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిసైడ్ అయ్యింది గులాబీ పార్టీ. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు సహా ఇతర హామీల వైఫల్యాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది.

కామారెడ్డిలో కవిత

## రైల్వే రోకో

కామారెడ్డి,తెలంగాణ దిశ: కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారంకామారెడ్డిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు.



- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు డిమాండ్
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- కాళేశ్వరంతోనిజామాబాద్‌కు ఒరిగిందేమీ లేదని వ్యాఖ్య
- నిజాం సాగర్ పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి
- జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలి
- కామారెడ్డి పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్

# రాష్ట్రపతి నిలయంలో సందడిగా భారతీయ కళా మహోత్సవం

## - రోజు 15 వేల మంది హాజరు...











**హైదరాబాద్, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 2వ ఎడిషన్ భారతీయ కళా మహోత్సవం సందడిగా కొనసాగుతోంది. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, జౌళి మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖల సహకారంతో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవం నిర్వహణతో రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతమంతా సందర్శకులతో కిక్కిరిసిపోయింది. రాష్ట్రపతి నిలయం.. భారతదేశంలోని మూడు అధ్యక్ష విడిది కేంద్రాలలో ఒకటి. ఇందులో ఒకటి ఢిల్లీలో మరొకటి సిమ్లాలో ఉండగా హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం దక్షిణ భారతదేశంలోని ఏకైకది. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక మన భారతదేశం. మనదేశంలో అనేక సంస్కృతులు, సాంప్రదాయాలు, కళలు కొలువుదీరాయి. వీటిని భాగ్య నగర వాసులకు తెలియ చెప్పేందుకు నగరంలోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవం పేరిట ఈ ఏడాది పశ్చిమ రాష్ట్రాల వైభవాన్ని ప్రదర్శిస్తున్నారు. గత ఏడాది మొదటి ఎడిషన్ లో భాగంగా ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, అస్సాం, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాల కళావైభవాన్ని ప్రదర్శించారు. ఈ ఏడాది రెండవ ఎడిషన్ లో భాగంగా ఈసారి పశ్చిమ భారత సుసంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం కల్పించారు. గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, డామన్, డయ్యూ, దాద్రా, నగర్ హవేలీ వంటి పశ్చిమ భారత ప్రాంతాల హస్తకళలు, నృత్యం, సంగీతం, సాహిత్యం, వంటకాల ద్వారా వారి జానపద సంస్కృతిని సందర్శకులు తెలుసుకునేలా ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ నెల 22న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కళా మహోత్సవం ఈ నెల 30 వరకు 9 రోజులపాటు కొనసాగుతుంది. ఈ కళా మహోత్సవాన్ని వీక్షించేందుకు ప్రతి నిత్యం వేల సంఖ్యలో సంధ్య చెకలు క్యూ కడుతున్నారు. రోజురోజుకు సందర్శకుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. రోజుకు సుమారు 15 వేల మంది సందర్శకులు ఈ కళా మహోత్సవాన్ని తిలకించేందుకు తరలివస్తుండడంతో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాలు జనాలతో కిక్కిరిసిపోయింది. ఇప్పటి వరకు 80 వేల మంది సందర్శకులు రాష్ట్రపతి నిలయంలోని కళా మహోత్సవంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. ప్రజలను ముఖ్యంగా యువతను మన సాంస్కృతిక వారసత్వంతో అనుసంధానం చేసేందుకు భారత ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది. వివిధ ప్రాంతాల్లో నివసించే ప్రజలు పరస్పరం అర్థం చేసుకోవటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడనున్నాయని రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజినీప్రియ తెలిపారు.

## ఘనంగా శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ



**కుత్బుల్లాపూర్, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి శివాలయం ప్రాంగణంలో ఆగం పాండు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ లు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ అయ్యప్ప స్వాములు భగవద్గీత పుస్తకాలను ముఖ్య అతిథులకు అందించారు. ఈ కార్యక్రమంలో వేమూరి రాములు గౌడ్, సత్యనారాయణ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ



**కుత్బుల్లాపూర్, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలో ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సంపూర్ణ ఆయురారోగ్యాలతో సుఖ:సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోలన్ జీవన్ రెడ్డి, కోలన్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## - కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్





**ఏఎస్ రావునగర్, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని కాంగ్రెస్ పార్టీ డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ అన్నారు. శుక్రవారంమహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సైనిక్ పురి చౌరస్తాలోని మహాత్మ జ్యోతిరావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానత్వం, మహిళా విద్య, దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడు పూలే ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.పూలే 1848లో సావిత్రిబాయి పూలేతో కలిసి దేశంలోనే మొదటి బాలికల పాఠశాలను స్థాపించడం, ఆ కాలంలో విప్లవాత్మక చర్య అని ప్రసాద్ గుర్తుచేశారు. విద్యే సమాజాన్ని మార్చగల గొప్ప ఆయుధమన్న నమ్మకంతో పూలే దంపతులు ఎన్నో అవమానాలు, అడ్డంకులు ఎదుర్కొన్నప్పటికీ వెనుదిరగలేదని ఆయన చెప్పారు. అణగారిన వర్గాలకు సమాన హక్కులు, ఆత్మ గౌరవం కల్పించేందుకు పూలే స్థాపించిన సత్యశోధక సమాజ్ సామాజిక మార్పుకు బాటలు వేసిందని ప్రసాద్ తెలిపారు. రైతుల సమస్యలపై పూలే చేసిన పోరాటం, విధవల పునర్వివాహానికి ఆయన ఇచ్చిన మద్దతు భారత సమాజంలో పెద్ద మార్పుకు కారణం అయ్యాయని అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సమానులేనని, ప్రతి మనిషికి విద్య, అవకాశాలు, గౌరవం లభించాలనే పూలే సిద్ధాంతాలు కాంగ్రెస్ పార్టీ పాటిస్తున్న విలువలని కేశెట్టి ప్రసాద్ స్పష్టం చేశారు. సమాజంలో కులం, వర్గం, మతం అనే తేడాలను తొలగించి సమానత్వం నెలకొనలన్న పూలే ఆశయాన్ని ముందుకు తీసుకు వెళ్ళేది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చూపించిన మార్గమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని అన్నారు. పూలే ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షులు కొత్త అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాకాల రాజు, అజీజ్, పాత కోటి రామలింగం, ఓబీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ముదిగొండ లింగస్వామి, శ్రీకాంత్ రెడ్డి, అల్లూరయ్య, బి. నరసింహ, టి. సందీప్ గౌడ్, ఆదినారాయణ, రవి, శ్రీనివాస్, జిఎస్ఎన్ రావు, యాదగిరి రెడ్డి, ఇబ్రహీం, పీరా, అల్లా బక్షి, హుస్సేన్ వల్లి, పద్మ, ఎస్ఎం. ఇబ్రహీం, వివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ఆత్మ గౌరవాన్ని కాపాడుదాం

## - స్థానిక సంస్థల్లో విజయబాట ఎగిరేద్దాం







**భువనగిరి, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :బహుజన విప్లవాల స్ఫూర్తి ప్రదాతమహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా బీసీ జాక్ నేతలు మాటూరి అశోక్, కొత్త బాలరాజు మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాల పూర్తి చేసుకున్నప్పటికీ రాజ్యాంగం ప్రకారం బీసీలను రాజకీయ పార్టీల జెండాలను పల్లకీలను మోసే కార్యకర్తలుగానే వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు, చట్టసభలలో రాజ్యాధికార దిశగా బీసీలు ఎదగకుండా అన్ని రాజకీయ పార్టీల అగ్రవర్ణాల నేతలు అడ్డుపడుతున్నారని అన్నారు. ఇకనైనా ఈ సమాజం మార్పును కోరుకుంటే బాగుంటుందని అన్నారు. అగ్రవర్ణాలు ఇచ్చే థాయిలాలకు ఆశ పడకుండా గ్రామాల్లో ప్రజలందరూ సంఘటితంగా నిలబడి అగ్రవర్ణాలను ఓడించినప్పుడే మనకు సరైన న్యాయం జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని నూటికి 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ లు కలిసికట్టుగా ఎన్నికల్లో ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మన బలాన్ని, బలగాన్ని చూపాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ప్రతి ఊరు వాడ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు డాక్టర్ మెరుగు మదన్ మోహన్, సుర్వి శ్రీనివాస్ గౌడ్, రత్నపురం బలరాం, మాయ దశరథ, చిన్నగారి బలరాం, కె. సత్యనారాయణ, కొల్లోజ్ సతీష్, రమేష్ కోటి తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

# దివ్యాంగులకు పూర్తి స్థాయిలో సేవలందిస్తాం

## - అదనపు కలెక్టర్ రాధికా గుప్తా





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :దివ్యాంగులకు అవసరమైన పూర్తి స్థాయి సేవలందించేందుకు అన్ని విధాల చర్యల తీసుకుంటామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సంబురాలలో భాగంగా శుక్రవారం ఘట్కేసర్ మండలంలోని ఎదులాబాదు లోని దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రాధికా గుప్తా మాట్లాడుతూ సెంటర్ లో 110 మంది ఉన్నారని, వారిలో అవసరమైన దివ్యాంగులకు స్పీచ్, ఫిజియో థెరపిల వంటి సౌకర్యాలను తప్పకుండా కల్పిస్తామని అన్నారు. అంతే కాకుండా దివ్యాంగులకు రావలసిన పెన్షన్లు త్వరలోనే మంజూరయ్యేలా చూస్తామన్నారు. కేంద్రానికి ఎదురుగా అసౌకర్యవంతంగా ఉన్న రోడ్డును బాగు చేయించాలని దివ్యాంగుల తల్లిదండ్రులు కోరగా, తప్పకుండా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. పుట్టినరోజు జరుపుకున్న దివ్యాంగులతో కేక్ కట్ చేయించి వారికి అదనపు కలెక్టర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాంబశివరావు, స్థానిక వికలాంగుల సమాఖ్య అధ్యక్షులు రవి, స్థానిక మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, డిపిఎం, ఎపిఎం, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన విప్లవాల స్ఫూర్తి ప్రదాత మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళులు





**సైనిక్ పురి, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే 135 వర్ధంతి సందర్భంగా సైనిక్ పురి చౌరస్తాలోని పూలే విగ్రహానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, వివిధ డివిజన్ల నాయకులు కార్యకర్తలు, తిరుపతయ్య సేవా సమితి ఆర్గనైజర్లు అవినాష్, యాట భాస్కర్, మల్లేష్ వంశరాజ్, సురేందర్, ఎస్ఎ. రహీం తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కు అభినందనల వెల్లువ



కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను శుక్రవారం డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి. నాగేశ్వర్ రెడ్డి, నర్సింహ, ప్రకాష్, ఉమేష్, రాజేష్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

(ఏఎస్ రావునగర్, తెలంగాణ దిశ)

# సంపాదకీయం

## ఎన్నాళ్లీ మారణహోమం!

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో బాంబు పేలుళ్లు జరిగాయి. ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర గేట్ –1 వద్ద పార్కింగ్ చేసిన ఓ కారులో పేలుళ్ళు జరిగాయి. ఈ ఘటనలో ఐదు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న దుకాణాల తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటన జరిగిన తర్వాత బాంబ్ స్క్వాడ్ బృందాలతో ఘటన స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు మొదలుపెట్టారు. మొదట్లో ఈ ఘటనలో ఒకరు మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత చనిపోయిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. పేలుడు ఘటనలో 8 మంది దుర్మరణం చెందారు. పేలుడు వల్ల 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారి శరీరాలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. గాయపడిన వారిని ఎల్ ఎన్ జీ పీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో చాలావరకు వాహనాలు ధ్వంసమైనట్టు తెలుస్తోంది. ఘటనా స్థలంలో దర్యాప్తు బృందాలు విచారణ మొదలుపెట్టాయి. ఈ పేలుడు వెనక ఉగ్ర ఉందేమోనన్న కోణంలో దర్యాప్తును మొదలు పెట్టాయి. ఆదివారం యాంటీ టెర్రరిజం స్క్వాడ్ విస్తృతంగా దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఉగ్ర మూలాలు ఉన్న వ్యక్తులను అరెస్ట్ చేసింది. వారిని అరెస్టు చేసిన తర్వాత ఒకరోజు వ్యవధిలో ఈ ఘటన జరగడం విశేషం. ఉగ్రవాదులు మనదేశంలో దాడులు జరపడానికి కుట్రలు పన్నారని యాంటీ టెర్రరిజం స్క్వాడ్ దర్యాప్తులో తేలింది. పలు ప్రాంతాలలో ఉగ్రవాదులను దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇది జరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. దీని వెనుక ఉగ్రవాదులు ఉన్నారని దర్యాదు బృందం అధికారులు అనుమానిస్తున్నారు. లోతుగా దర్యాప్తు మొదలుపెట్టారు. మన దేశంలో గడిచిన వారం రోజుల వ్యవధిలో ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం విస్తృతంగా దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో నలుగురు డాక్టర్లు అరెస్టు అయ్యారు.. వీరి వద్ద నుంచి పోలీసులు ఏకంగా 2900 వందల కిలోల పేలుడు పదార్థాలను, రైఫిళ్ళు, పిస్టల్స్, రిసిన్, అమోనియం నైట్రేట్ వంటి విష పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.. ఈ పరిణామం జరిగిన గంటల వ్యవధిలోనే ఢిల్లీలో భారీ పేలుడు చోటుచేసుకుంది. వాస్తవానికి ఈ పేలుడు అనేక సంచలన విషయాలను బయటపెట్టింది. ఉగ్రవాద వ్యతిరేక బృందం నలుగు డాక్టర్లను అరెస్ట్ చేసిన తర్వాత.. ఉగ్ర కుట్ర బయటపడింది. ఢిల్లీ ప్రాంతంలోని ఫరీదాబాద్ లో ఆల్ ఫలాయ్ యూనివర్సిటీ లో అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ముజమిల్ షకీల్, జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆదిల్ అహ్మద్ రథర్, గుజరాత్ లోని డాక్టర్ అహమ్మద్ మోహియుద్దీన్ సయ్యద్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర చెందిన మహిళ డాక్టర్ ను ఉగ్రవాద వ్యతిరేక పోలీసుల బృందం అరెస్ట్ చేసింది.. జమ్ము కాశ్మీర్, ఫరీదాబాద్ ప్రాంతాలలో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు.. ఇందులో ఏకంగా నలుగురు పట్టు పడ్డారు. సమాజంలో వీరిని ఎవరు కూడా అనుమానించారనే ఉద్దేశంతోనే ఉగ్రవాద సంస్థలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. దేశవ్యాప్తంగా దాడులకు ప్రణాళిక రూపొందించారు. అరెస్ట్ అయిన వైద్యులు జైషే ఏ మహమ్మద్, అన్సార్ గజ్వతుల్ హింద్ అనే ఉగ్రవాద సంస్థల తో సంబంధం ఉన్నట్టు విచారణలో తేలింది. డాక్టర్ కాబట్టి ఎవరూ అనుమానించరనే ఉద్దేశంతోనే వీరు ఉగ్రవాద సంస్థలకు టచ్ లో ఉండేవారని తెలుస్తోంది. ఇక అరెస్టు అయిన వారిలో ఇద్దరు డాక్టర్లు 2018 –2021 కాలంలో భారత భద్రతా దళాల దాడిలో గాయపడిన ఉగ్రవాదులకు చికిత్స అందించారని తెలుస్తోంది.. ఇక ఇదే క్రమంలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ మాడ్యూల్ మొత్తాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.. ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కూడా ఉగ్రదాడి అని అనుమానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో.. ఈ నలుగురు పట్టుబడ్డారు. దేశ రాజధానిలో పేలుడు జరిగిన నేపథ్యంలో ఈ ఘటన సంచలనంగా మారింది. సరిగ్గా ఆదివారం ఆముదంతో విషయం తయారు చేసే వందల మందిని చంపడానికి కుట్ర చేసిన హైదరాబాద్ ఉగ్రవాది సయ్యద్ అహ్మద్ మోహియుద్దీన్, మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ఘటన జరిగిన ఒక రోజు వ్యవధిలోనే ఈ దారుణం చోటు చేసుకోవడం గమనార్హం. ఆముదం గింజలను ప్రాసెస్ చేసి.. మిగిలిపోయిన వ్యర్థాలతో అత్యంత ప్రమాదకరమైన రైసిన్ అనే విష రసాయనాన్ని తయారు చేశారు. ఈ వ్యవహారం దర్యాప్తు బృందం అధికారుల విచారణలో తేలింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఇటీవల ముగ్గురు ఉగ్రవాదులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరు దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర చేశారని భద్రతా అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. భారత్ చుట్టూ ఉగ్రవాదాన్ని విస్తరించేందుకు పాకిస్తాన్ కుట్రలు చేస్తోందని పేర్కొన్నాయి. అందులో భాగంగా భారత సరిహద్దు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో.. ఉగ్ర స్థావరాలు, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపాయి. భారత సరిహద్దులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉగ్ర నివాసాలన ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పాయిఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్ర స్థావరాల ఏర్పాటు మరింత వేగవంతమైనట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఉగ్రవాద ట్రైనింగ్ తీసుకునే వారి కోసం బంగ్లాదేశ్, నేపాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో శిక్షణ శిబిరాలు, నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తున్నాయని తెలిపాయి. కాగా, ఇటీవల బంగ్లా, నేపాల్ సరిహద్దుల్లో ఉన్న పలు రాష్ట్రాల్లో ఉగ్రవాద అనుమానితులను భద్రతా సంస్థలు అరెస్ట్ చేశాయి. ఈ నేపథ్యంలో ఈ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే భారత సరిహద్దు ప్రాంతాల్లో భద్రత పెంచినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా బంగ్లా, నేపాల్‌లలో విదేశీ నిధులతో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టులపై కూడా ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా పెట్టినట్లు తెలిపాయి. లష్కరే తొయిబా, జైషే మహమ్మద్‌లు సమన్వయ దాడులకు సిద్ధమవుతోన్నట్టు ఇటీవల నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ఉగ్రవాద సంస్థలు చొరబాట్లు, గూఢచర్యం, సరిహద్దు లాజిస్టిక్స్ కార్యకలాపాలను గణనీయంగా పెంచాయని వెల్లడించాయి. తాజాగా మళ్లీ.. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ నేపాల్‌లో తమ సంస్థలను విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించడం గమనార్హం. అల్–ఖైదా, ఐసిస్ గత ఐదు నెలలుగా బంగ్లాదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడానికి ప్రయత్నాలు వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నాయి. అందులో భాగంగా పాక్‌లోని పలు ప్రాంతాల నుంచి బంగ్లాదేశ్‌కు, నేపాల్‌కు నిరంతరం ఉగ్రవాదుల వలసలు కొనసాగుతున్నాయని తెలిపాయి. అయితే ఆ ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాల నిర్మాణానికి టర్కీ (తుర్కియే) నుంచి నిధులు అందుతున్నట్లు నిఘా సంస్థలు గుర్తించినట్లు తెలుస్తోంది. గతేడాది మహమ్మద్ యూనస్ నేతృత్వంలో బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు అయింది. అప్పటి నుంచి భారత్ వ్యతిరేక శక్తులకు బంగ్లా వేదికగా మారింది. మహమ్మద్ యూనస్ సారథ్యంలో ఈ వ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయి. దీంతో పాకిస్తాన్ ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ కొత్త గమ్యస్థానంగా మారిపోయింది. ఇటీవల భారత్‌కు చెక్ పెట్టేలా పాకిస్తాన్ మాస్టర్ ప్లాన్ వేసింది. బంగ్లాదేశ్ జనపనార ఉత్పత్తుల దిగుమతులపై భారత్ ఆంక్షలు విధించిన కొన్ని రోజులకే.. తన కరాచీ పోర్ట్‌ను వినియోగించుకునేందుకు బంగ్లాదేశ్‌కు పాకిస్తాన్ బంపరాఫర్ ఇచ్చింది.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తా

### - బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్ట్ సంఘాల నాయకులు వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి జర్నలిస్టుల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడంతో పాటు ప్రెస్ క్లబ్ భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయిస్తానన్నారు. అదే విధంగా ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. దొమ్మర పోచంపల్లి పరిధిలో ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న సంబంధిత శాఖ మంత్రితో సైతం చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. సూరారంలో నిర్మించ తలపెట్టిన ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత తనదేనని, ఇప్పటికే కొంత శాతం నిర్మాణం జరిగిందని, మరో రూ. 10 లక్షలతో వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. భవన నిర్మాణానికి అవసరమైతే మరో రూ. 20 లక్షలు తాను సొంతంగా ఇచ్చి పూర్తి చేస్తానని, అట్టి భవనానికి తన తండ్రి కూన మాణిక్యం పాండు జర్నలిస్ట్ భవన్ గా ఇక్కడి జర్నలిస్టులకు అందిస్తానని వివరించారు. స్థానికంగా ఉన్న కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో సైతం మాట్లాడి జర్నలిస్టులకు వైద్య సహాయం అందే దిశగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్నాని మారుతి సాగర్, టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, టిఎస్ యూడబ్ల్యుజె నాయకులు గుంటూరు శేఖర్, కసుకుర్తి వెంకట్, టియుడబ్ల్యుజె నాయకులు రంగు వెంకటేష్ గౌడ్, కొలిపాక వెంకట్, ఉద్దండపురం వెంకటేష్ గౌడ్, శివాజీ, కుంట అనిల్ కుమార్, ఫెడరేషన్ నాయకులు దామెర జగదీశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# సమాజం మారాలంటే మనమే ముందుకు రావాలి

### - టీటీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు





**సైనిక్ పురి, నవంబర్ 28 (తెలంగాణ దిశ)** :స మాజం మారాలంటే మనమే ముందుకురావాలని మహాత్మ పూలే జీవితం మనందరికీ సందేశాన్ని ఇస్తుందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా సైనికపురి చౌరస్తా లో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం, మహిళ విద్య కోసం మహాత్మ జ్యోతిరావు పూలే పోరాటం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని అన్నారు. మన గుండెల్లో నుండి వచ్చే భక్తి, గౌరవమే ఆ మహనీయుడికి మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. దళితులు, వెనుకబడిన వర్గాల వారికి సమాన హక్కులు, విద్య, ఆత్మగౌరవం కల్పించడానికి 1873లో ఆయన సత్యశోధక సమాజ్ ను స్థాపించారని గుర్తు చేశారు. కులం పేరుతో జరిగిన దుర్వినియోగాన్ని, అణచివేతను నిర్దాక్షిణ్యంగా ప్రశ్నించిన తొలి నాయకుల్లో పూలే ముందుంటారని అన్నారు. పూలే రచించిన గులామ్‌గిరి భారత సామాజిక చరిత్రలో ఒక మైలురాయిని అన్నారు. ఈ పుస్తకంలో కుల వివక్ష, బ్రిటిష్ దోపిడీని, సమాజంలోని అసమానతలను ఆయన ధైర్యంగా బహిర్గతం చేశారని అన్నారు. రైతుల బాధలను అర్థం చేసుకొని, వారి సమస్యలను ప్రభుత్వం ముందుకు తెచ్చి ఉద్యమాలు చేసిన తొలి సంస్కరణవాది కూడా ఆయనేనని అన్నారు. ప్రతి రంగంలో పూలే సమానత్వాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పనిచేశారని అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, మహిళల విద్యావకాశాలు, అణగారిన వర్గాల ఎదుగుదలకు ఆయన ఆలోచనలు ప్రస్తుత సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే శక్తిగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా మాజీ కౌన్సిలర్ గడ్డమీది రాములు యాదవ్, సిహెచ్. మల్లేష్ వంశరాజ్, గోబేరు రమేష్, పడాల ఆనంద్ చారి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బస్ డిపో ఆవరణలో ఘనంగా మహాత్మా జ్యోతి రావు పూలే వర్ధంతి వేడుకలు



**కుషాయిగూడ, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ బస్ డిపో ఆవరణలో మహాత్మా జ్యోతి రావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వేణుగోపాల్, సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, మెకానికల్ ఫోర్ మెన్ వ్యాస్, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ కె. లక్ష్మణస్వామి, రీజనల్ అధ్యక్షురాలు సృజన, కుషాయిగూడ డిపో అధ్యక్షులు చీర ఉపేందర్, ప్రధాన కార్యదర్శి తోడేటి శ్రీనివాస్, కోశాధికారి మచ్చ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, సంయుక్త కార్యదర్శి శ్రీశైలం, వెంకటేష్, ఉపాధ్యక్షులు పద్మ, ప్రచార కార్యదర్శి రోమన్, ఎస్ సి, ఎస్ టి వెల్ఫేర్ రాష్ట్ర కార్యదర్శి రవి కిరణ్, డిపో అధ్యక్షులు చక్ర మోహన్, నర్సింగరావు, ఆంజనేయులు, బిక్షమయ్య, సునీత, జయమ్మ, లక్ష్మి, పాండు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా విద్య పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే

### - మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి





**ఏఎస్ రావునగర్, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :దేశంలో సామాజిక విప్లవానికి, సమానత్వ పోరాటానికి మహాత్మ జ్యోతిరావు పూలే మార్గ దర్శకుడని డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి పురస్కరించుకొని శుక్రవారం సైనిక్ పురిలోని పూలే విగ్రహానికి ఆమె పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పావని రెడ్డి మాట్లాడుతూ మహిళా విద్య, దళితుల హక్కులు, సమాజ సంస్కరణల కోసం నిస్వార్థంగా జీవితాన్ని అర్పించిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. చిన్ననాటి నుంచే కులవివక్ష, సామాజిక అన్యాయాల్ని దగ్గరగా చూసిన ఆయనలో సమాజాన్ని మార్చాలనే జ్వాల రగిలిందన్నారు. తద్వారా ప్రతి మనిషి సమానుడే అనే విశ్వాసాన్ని తన జీవిత ధ్యేయంగా మార్చుకున్నారని ఆమె తెలిపారు. పూలే దంపతులు భారతదేశానికి ఇచ్చిన గొప్ప వరం మహిళా విద్య అని అన్నారు. సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో పూణెలో దేశంలోనే మొదటి బాలికల పాఠశాలను స్థాపించడం వారి చరిత్రాత్మక అడుగని అన్నారు. ఆ కాలంలో బాలికలు చదవడం పాపంగా భావించిన సమాజంలో బాలికల కోసం పాఠశాలలు పెట్టడానికి ఎంత ధైర్యం కావాలో మనం ఊహించవచ్చునని అన్నారు. పూలే దంపతులు ఎదుర్కొన్న అవమానాలు, దాడులు, బహిష్కరణలు అన్నింటినీ భరిస్తూ మహిళా విద్యను వెలుగులోకి తెచ్చారని, ఇందుకే జ్యోతి బాను మహాత్మా జ్యోతిరావు పూలేను మహిళా విద్య పితామహుడని గౌరవంగా పిలుస్తారని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, నర్సింహ, ప్రకాష్, ఉమేష్, రాజేష్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




### హ్యాపీ క్రిస్మస్ సీజన్ కు

# సంగీత స్వాగతం

### 29న రవీంద్రభారతిలో గ్రాండ్ కాన్సర్ట్

**హైదరాబాద్, నవంబర్ 28, తెలంగాణ దిశ) :** క్రిస్మస్ సీజన్‌కు స్వాగతం చెప్పేందుకు నగరం సిద్ధమైంది. ప్రముఖ కోరల్ బృందం ది ఫెస్టివల్ కొయర్‌స్టర్స్, హైదరాబాద్ ఈనెల 29న సాయంత్రం 7 గంటలకు రవీంద్రభారతిలో గ్రాండ్ కాన్సర్ట్‌ను నిర్వహిస్తోంది. వాట్ ఎ డే ఆఫ్ జాయ్ పేరుతో జరగనున్న ఈ ప్రదర్శనను సంగీతాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హృదయాన్ని హత్తుకునే హార్మోనీస్, భావోద్వేగాలను రేకెత్తించే స్వరాల విన్యాసం కొయర్‌స్టర్స్‌కి ప్రత్యేకత. అందుకే ప్రతి సంవత్సరం వీరి ప్రదర్శనలకు మంచి ఆదరణ లభిస్తుంది. ఈసారి కూడా క్రిస్మస్ వేడుకల ఉత్సాహాన్ని మరింత పెంచేలా కార్యక్రమాన్ని సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కాన్సర్ట్ క్లాసికల్, సెమీ క్లాసికల్, ఆధునిక క్రిస్మస్ సంగీతం, సంప్రదాయ కీర్తనలతో కొత్త సంగీత అలంకరణలు, కొరల్ హార్మోనీస్, సోలో పార్ట్స్, ఎన్సెంబుల్ పీస్‌లు తదితర ప్రత్యేకతలతో ప్రేక్షకులను అలరించనున్నాయి. క్రిస్మస్‌లోని ఆనందం, శాంతి వీటిని సంగీతం ద్వారా అందరికీ పంచడమే మా లక్ష్యమని నిర్వాహకులు చెప్పారు. ప్రతీ నోట్ , ప్రతీ కోర్ భాగంలో శ్రద్ధ పెట్టి ప్రాక్టీస్ చేసినందున ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతి దక్కుతుందని వారు నమ్ముతున్నారు. హైదరాబాద్‌లో క్రిస్మస్ సీజన్ వేడుకలకుఈ కాన్సర్ట్ శుభారంభంగా నిలుస్తుందని సంగీత ప్రియులు భావిస్తున్నారు.

# ఇందిరా మహిళా శక్తి

# తెలంగాణ రుచులు క్యాంటీన్ ప్రారంభం







**కుత్బుల్లాపూర్, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు.
మహిళా కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మితో కలిసి భవాని మహిళ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి తెలంగాణ రుచులు క్యాంటీన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజనోళ్ల లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుంద న్నారు. ఇందులో భాగంగా మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేస్తుందని గుర్తు చేశారు. అదే విధంగా కోటి మంది మహిళలకు కోటి చీరలను అంద జేస్తుందన్నారు. మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు అనురాధ, శోభ, ప్రార్థన లక్ష్మి, నారాయణమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షోభ హాస్టళ్లు !?

**హైదరాబాద్,తెలంగాణ దిశ:**సంక్షేమ హాస్టళ్లుసంక్షోభహాస్టళ్లు గా మారుతున్నాయి. ఉమ్మడి ఎపిలో ఎలా ఉన్నాయో..ఇప్పుడు రాష్ట్రం రెండుగా విడిపోయాక కూడా వాటి స్వరూప స్వభావాలు మారలేదు. పిల్లల పేరు చెప్పి కొందరు పందికొక్కుల్లా బలుస్తున్నారు. వార్డెన్లు భయం లేకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అన్నింటికి మించి సంక్షేమ హాస్టళ్లో కాలం వెళ్లదీస్తున్న పిల్లల జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో తెలియడం లేదు. అమ్మాయిలైతే బలవంతపు అత్యాచారా లకు గురవుతున్నారు. ఇదో రకమైన హింస. ఇందులో బయటకు వచ్చే కేసులు కొన్ని మాత్రమే. ఇకపోతే సరైన ఆహారం ఉండదు. సరైన వసతి ఉండదు. నాసిరకం ఆహారంతో వాంతులు విరేచనాలతో ఆస్పత్రి పాలు కావడం, అందులో కొందరు మృత్యువాత పడడం... తలంలిదండరులకు క్షోభ మిగల్చడం అన్నది భేతాళ కథల్లా సాగుతున్నా యి. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ హాస్టళ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. హాస్టళ్లలో ఉండే పిల్లలను పురుగుల్లా చూస్తున్నారు.

# కాలేయాన్ని కాపాడుకుందాం



మానవ శరీరంలో ఒక ముఖ్యమైన అవయవం కాలేయం (లివర్). శరీరం లోపలి అవయవాల్లో ఇదే అతి పెద్దది. ఒకరకంగా దీన్ని అవిశ్రాంత కర్మాగారంతో పోల్చుకోవచ్చు. నిరంతరం ఒకే సమయంలో ఎన్నెన్నో పనులను నిర్వహిస్తుంటుంది. కణజాలాలు, కండరాలు పనిచేయటానికి అవసరమైన శక్తిని అందించే గ్లూకోజు మోతాదులు నియంత్రణలో ఉండటంలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉన్నప్పుడు దాన్ని గ్రహించి, తనలో దాచుకుంటుంది. ఎప్పుడైనా గ్లూకోజు మోతాదులు పడిపోయినప్పుడు వెంటనే విడుదల చేస్తుంది. మనం ఆహారం ద్వారా తీసుకున్న కొవ్వు పదార్థాలు జీర్ణం కావటంలోనూ పాలు పంచుకుంటుంది. ఇదొక గ్రంథి కూడా. ఇది స్పాంజిలా, చీలిక ఆకారంలో, ఎరుపు–గోధుమ రంగులో, ఫుట్‌బాల్ పరిమాణంలో ఉంటుంది. ఎత్తు, బరువు ఆధారంగా పరిమాణం మారుతూ వుంటుంది. శరీరంలోని ఇతర భాగాలకు అవసరమైన ప్రోటీన్లు, హార్మోన్లను తయారు చేస్తుంది. ఒక వ్యక్తిలో సగటున మూడు పౌండ్ల బరువు ఉండే కాలేయం అతిపెద్ద అంతర్గత అవయవం. సాధారణ పరిస్థితుల్లో, కాలేయం శరీరం యొక్క కుడి వైపున, పక్కటెముకల కింద ఉంటుంది. సిటస్ ఇన్వర్సస్ అనే స్థితిలో, కాలేయం ఎడమ వైపున ఉంటుంది. ఒత్తిడి, ఇతరత్రా కారణాలతో కాలేయ వ్యాధులు వ్యాపిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటేటా సుమారు 20 లక్షల మంది కాలేయ వ్యాధితో మరణిస్తున్నారంటే పరిస్థితిని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దాదాపు సగం సిర్రోసిస్ సమస్యల కారణంగానూ, ఇంకో సగం వైరల్ హెపటైటిస్, హెపాటోసెల్యులర్ కార్సినోమా కారణంగా ఈ మరణాలు సంభవిస్తున్నాయి. ఎక్కువగా ఊబకాయం, మందులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, అధికంగా ఆల్కహాల్ తీసుకోవటం, జన్యుపరమైన రుగ్మతలు, అధికంగా మద్యం సేవించటం వంటివి కాలేయాన్ని దెబ్బతీస్తాయి. కాలేయ వాపు, దెబ్బతినటంతో మచ్చకణజాలం ఏర్పడటానికి కారణమవుతుంది.

**నిర్ధారించే పరీక్షలు ఇవీ:** కాలేయ జబ్బును గుర్తించటానికి లివర్ ఫంక్షన్ పరీక్షలు ఉపయోగపడతాయి. అయితే ఫ్యాటీ లివర్ వీటిల్లో అంతగా బయటపడదు. పరీక్ష ఫలితాలు అన్నీ నార్మల్‌గా ఉన్నా కూడా లోపల కాలేయం దెబ్బతిని ఉండొచ్చు. అల్ట్రాసౌండ్ పరీక్షలోనైతే బాగా బయటపడుతుంది. ఇందులో లివర్ బాగా మెరుస్తున్నట్టుగా, తెల్లగా కనిపిస్తుంది. దీని ద్వారా సమస్యను తేలికగా, స్పష్టంగా, ఖచ్చితంగా గుర్తించొచ్చు. ఎలాస్టోస్కాన్ పరీక్షలో కాలేయం ఎంతవరకు దెబ్బతిన్నది? ఎంతవరకు గట్టిపడింది? అనేవీ తెలుస్తాయి. అవసరమైతే సీటీ, ఎమ్మారై స్కాన్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. తొలిదశలోనే గుర్తిస్తే మందులు, జీవనశైలి మార్పులతోనే జబ్బు నయమయ్యే అవకాశముంది.

**అధునాతన చికిత్సా పద్ధతులు:** కాలేయ జబ్బుకు సమగ్రమైన చికిత్స చాలా ముఖ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే ఆసుప్రతులు, క్లినిక్‌లలో మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో కూడా అధునాతన శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవా ట్రస్ట్ (ఆరోగ్యశ్రీ) ద్వారా కాలేయ వ్యాధి గ్రస్తులకు చికిత్సలు అందుబాటులోనే ఉంటున్నాయి. అందువల్ల కాలేయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో అధునాతనమైన చికిత్సలు, పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కాలేయం గట్టిపడినవారికి మార్పిడి అవసరపడొచ్చు. కాలేయంలో ప్రధాన రక్తనాళం మూసుకుపోయినవారికి మరింత జాగ్రత్తగా కాలేయ మార్పిడి చేయాల్సి ఉంటుంది. కాలేయ క్యాన్సర్ గలవారికి కొంత భాగం తొలగించాల్సి రావొచ్చు. క్యాన్సర్ తొలిదశలో ఉంటే చికిత్సతోనే ఫలితం కనిపించొచ్చు. మెటబాలిక్ జబ్బు గలవారికి మందులతోనే నయం కావొచ్చు.

**అనేక రకాల జబ్బులు:** కాలేయ జబ్బు అని ఒకే పేరుతో పిలుచుకున్నా ఇందులో చాలా రకాలున్నాయి. వీటిల్లో ప్రధానమైనవి కాలేయానికి కొవ్వు పట్టటం (ఫ్యాటీ లివర్).. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి ఇన్‌ఫెక్షన్లు.. విల్సన్స్ డిసీజ్ వంటి జీవక్రియల సమస్యలు. సుమారు 80 శాతం కాలేయ జబ్బుకు ఇవే కారణం. వీటికి తోడు క్యాన్సర్. ఇవన్నీ కాలేయాన్ని నిర్వీర్యం చేసేవే. వీటికి రకరకాల అంశాలు దోహదం చేస్తుంటాయి.

**కాలేయ మార్పిడి:** కిడ్నీ విఫలమైతే డయాలిసిస్‌తో రక్తాన్ని శుద్ధి చేసుకునే వీలుంది. కానీ కాలేయం పూర్తిగా విఫలమైతే ఎలాంటి ప్రత్యామ్నాయమూ లేదు. కాలేయ మార్పిడి ఒక్కటే శరణ్యం. ఇది ప్రాణాలు కాపాడే చికిత్స. దీన్ని చేయించుకున్నవారిలో 85–90 శాతం యథావిధిగా పనులు, ఉద్యోగాలు చేసుకోవటం గమనిస్తున్నాం. శస్త్రచికిత్స ఖరీదైనది కావటమే సమస్య. కానీ జబ్బు తీవ్రమై మాటిమాటికీ ఆసుపత్రిలో చేరి, చికిత్స తీసుకోవటంతో పోలిస్తే ఇదంత ఎక్కువేమీ కాదనే చెప్పుకోవచ్చు. పైగా ప్రాణాలనూ కాపాడుకోవచ్చు. ప్రస్తుతం చాలావరకు సన్నిహిత కుటుంబ సభ్యులు, బంధువుల వంటి సజీవ దాతల నుంచే కాలేయాన్ని తీసుకొని, మార్పిడి చేస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం దాతలైనా, గ్రహీతలైనా నాలుగు వారాల్లోనే తిరిగి మామూలు స్థితికి చేరుకుంటారు. కాలేయం తిరిగి త్వరగానే వద్ధి చెందుతుంది. సగం వరకు కత్తిరించినా రెండు నెలల్లోనే దాదాపుగా యథాస్థితికి చేరుకుంటుంది. కాబట్టి కాలేయ మార్పిడి, అవయవ దానం గురించి భయపడాల్సిన పనిలేదు.

**సిర్రోసిస్ సంకేతాలు ఇవే..:** ఆకలి కోల్పోవడం, బరువు తగ్గడం, బలహీనత, కామెర్లు, దురద, ఎగువ జీర్ణశయాంతర రక్తస్రావం సంకేతాలు, పొత్తికడుపులో వాపు (అస్సైట్స్). ఉదరంలోని అవయవాల చుట్టూ ద్రవం పేరుకుపోతుంది), మూడ్ మార్పులు, గందరగోళం, అసాధారణ నిద్ర విధానాలు, కండరాల తిమ్మిరి, ఇది తీవ్రంగా ఉంటుంది, క్రమరహిత రుతు రక్తస్రావం, వంధ్యత్వం, మగవారిలో రొమ్ము అభివృద్ధి, స్పైడర్ సిరలు..

**చికిత్సలు ఎలా చేస్తారంటే..:** అసిటిస్ (కడుపు వాపు)అసిటిస్ చికిత్సకు, డాక్టర్స్ డైయూరిటిక్స్ అని పిలిచే మందులను సూచిస్తారు, ఇది శరీరం అదనపు ద్రవాన్ని విసర్జించడానికి సహాయపడుతుంది. ఈ పరిస్థితి ఉన్న వ్యక్తులు వారు వినియోగించే సోడియం మొత్తాన్ని తగ్గించాలని కూడా వారు సిఫార్సు చేస్తారు. విపరీతమైన సందర్భాల్లో యుఎస్‌జి పారాసెంటెసిస్ అనే సాంకేతికతను ఉపయోగించి ఉదరం నుండి ద్రవాన్ని తీసేస్తారు. కొన్ని సందర్భాల్లో ట్రాన్స్‌జుగ్యులర్ ఇంట్రాహెపాటిక్ పోర్టోసిస్టమిక్ షంట్ (టిప్స్) అంటే కాలేయంలో ఒక స్టెంట్‌ను ఉంచడం ద్వారా రక్తం కాలేయాన్ని దాటవేయడానికి అనుమతిస్తుంది, ఇది కాలేయంలో మచ్చల కారణంగా ఏర్పడే ఒత్తిడిని కొంతవరకు తగ్గిస్తుంది.

# జిడ్డును అడ్డుకోండి!



కొందరి చర్మం.. జిడ్డుగా ఉంటుంది. సెబమ్ గ్రంథులు అధికంగా నూనెలను ఉత్పత్తి చేయడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. ఇంకొందరిలో జన్యుపరంగా ఉంటే, మరికొందరిలో హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి.. ఇలా రకరకాల కారణాలతో 'జిడ్డు చర్మం' ఇబ్బంది పెడుతుంది. ఇక వేసవిలోనైతే చెమటతో కలిసి.. మరింత అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా.. 'జిడ్డు చర్మం' సమస్యలకు ఇట్టే చెక్ పెట్టొచ్చని అంటున్నారు సౌందర్య నిపుణులు. వేసవిలో చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం ముఖ్యం. ఇందుకోసం రోజుకు కనీసం 8–10 గ్లాసుల నీరు తాగాలి. ఫలితంగా శరీరంలోని విష పదార్థాలు బయటికి పోవడంతోపాటు జిడ్డు కూడా తగ్గుతుంది. జిడ్డు చర్మం ఉన్నవారు ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. నూనెలో వేయించిన పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్, పాల ఉత్పత్తులను తగ్గించాలి. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. ఇవి చర్మంలో నూనెల ఉత్పత్తిని నియంత్రించడంలో సాయపడతాయి. చర్మం జిడ్డుగానే ఉంటుంది కాబట్టి వేసవిలో మాయిశ్చరైజర్స్, సన్‌స్క్రీన్ లోషన్స్ వాడాల్సిన అవసరం లేదని అనుకుంటే.. పొరపాటే! కాలా నికి అనుగుణం గా ఉత్పత్తులను ఎంచుకోవాల్సిందే! అప్పుడే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జిడ్డు చర్మం ఉన్నవారు ఆయిల్–ఫ్రీ, వాటర్ బేస్డ్ మాయిశ్చరైజర్స్‌ను వాడాలి. ఎస్పీఎఫ్ 30, అంతకంటే ఎక్కువ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్.. వీరికిమంచి ఎంపిక. ఇవి చర్మాన్ని రక్షిస్తూనే.. జిడ్డును అదుపులో ఉంచుతాయి. వారానికి ఒకసారైనా ముల్తానీ మట్టి, బెంటోనైట్ క్లే మాస్క్‌ను వాడాలి. ఇవి అదనపు జిడ్డును తగ్గించడంతోపాటు చర్మాన్ని శుద్ధి చేస్తాయి. ఎండకాలంలో ఎక్కువగా మేకప్ వేసుకోకపోవడమే మంచిది. అవసరం అనుకుంటే..తక్కువగా, నాన్–ఆయిలీ ఉత్పత్తులనే ఎంచుకోవాలి. ఈ చిట్కాలను పాటిస్తే..చర్మం సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. ఎండకాలంలోనూ అందంగా మెరిసిపోవచ్చు.

# ఒక్క అడుగుతో పెద్ద మార్పు!




'పక్షులు మానవునికి జీవన గమనం నేర్పుతాయి. వాటిని కాపాడటం మన కర్తవ్యం' అంటారు భారతదేశ పక్షి శాస్త్ర పితామహుడు సలీం అలీ. జీవ పరిణామ క్రమంలో ఉద్భవించిన అద్భుత జంతుజాలమే పక్షులు. ఈసృష్టిలో పక్షులది ఒక ప్రత్యేకమైన స్థానం. ప్రకృతికి అందాన్ని,మానవాళికి జీవవైవిధ్యంతో పాటు ఆనందానిఅందిస్తాయి. 'భూమిపై జీవితం యొక్క గొప్ప ఆనందాలలో పక్షుల గానం ఒకటి' అంటారు ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు రాబర్ట్ లిండ్. వీటి జీవన విధానం మనిషికి సహనాన్ని, శ్రమను, స్వేచ్ఛను నేర్పుతాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకమైన పాత్ర పోషిస్తాయి. పక్షులు–పర్యావరణం మధ్య ఉన్న అవినాభావ సంబంధం మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమైనది. వ్యవసాయంలో కీలకమైన పాత్ర వహిస్తాయి. పంటలకు హానిచేసే, కీటకాలను, పురుగులను తినడం ద్వారా తెగుళ్లు రాకుండా పరోక్షంగా పంటలను రక్షిస్తాయి. పువ్వుల్లోని పుప్పొడిని ఒకచోటు నుండి మరోచోటుకు తీసుకువెళ్లి పునరుత్పత్తికి సహాయపడతాయి. విత్తనాలను వ్యాప్తి చేయడంలో సహాయపడటం ద్వారా అడవుల పెరుగుదలకు సహకరిస్తాయి. చనిపోయిన జంతువులను తినే రాబందు వంటి పక్షులైతే పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలోనూ సహాయపడతాయి. అందుకే–'పక్షులు వ్యవసాయానికి, పర్యావరణానికి సహజ మిత్రులు' అంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, పక్షులు మానవాళికి అవసరమైన ఆహార గొలుసులో ముఖ్యమైన భాగంగా ఉంటూ పర్యావరణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్రాముఖ్యతను వివరిస్తూ 'ప్రతిదీ మరొకదానితో ముడిపడి ఉంది' అంటారు జాన్ ముయిర్. పర్యావరణంలోని ఈసంక్లిష్టమైన సంబంధాలలో పక్షులు ఒక ముఖ్యమైన బంధం. పక్షులు, మూగజీవాలు కళ్ల ముందే చనిపోతున్నా పెద్దగా పట్టించుకోరు చాలామంది. కానీ, ఓ పక్షి ప్రాణాలు కాపాడేందుకు స్వయంగా జడ్జి, కలెక్టర్ రంగంలోకి దిగారు. కన్నూరు జిల్లా, ఉల్లిక్కల్ పంచాయతీ పరిధిలోని మూసేసిన ఓ టెక్స్‌టైల్ షాపు గ్లాస్ ప్యానెల్‌లో ఓపక్షి చిక్కుకుంది. ఆ ప్యానెల్‌లో నుంచి బయట పడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంది. కానీ సాధ్యం కాలేదు. పక్కనున్న షాపులవాళ్లు చూసినా కాపాడలేని పరిస్థితి. బిజినెస్ పార్ట్‌నర్స్ మధ్య ఏర్పడిన వివాదం కారణంగా ఆ షాపును కొన్ని నెలల క్రితం కోర్టు సీజ్ చేసింది. షాపు తెరవాలంటే, కోర్టు అనుమతి తీసుకోవాల్సిందే. ఇందుకోసం జిల్లా కలెక్టర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. దీనిపై స్పందించిన జడ్జి%ౌ% నేరుగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. షాపును తెరిపించి, మూడు రోజులపాటు గ్లాస్ ప్యానెల్‌లో చిక్కుకున్న పక్షిని ప్రాణాలతో కాపాడారు. ఆ పక్షి స్వేచ్ఛగా గాల్లోకి ఎగిరిపోయింది. అయితే, పక్షుల మనుగడ నేడు ప్రమాదంలో పడింది. ఈ ఒక్క పక్షినైతే రక్షించగలిగారు. కానీ, పట్టణీకరణ, అడవుల నిర్మూలన, కాలుష్యం, వ్యవసాయంలో రసాయనాల వినియోగం వల్ల పక్షుల ఆవాసాలు తగ్గిపోతున్నాయి. ఆహారం లభించక, విషపూరితమైన వాతావరణంలో జీవించలేక అనేక పక్షి జాతులు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. 'అభివృద్ధి క్రమం అంతా ప్రకృతి హక్కుల ఉల్లంఘనే' అంటారు పర్యావరణ కార్యకర్త సత్యశ్రీనివాస్. ఆధునిక సాంకేతికత అభివృద్ధి వల్ల పక్షుల మనుగడకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోంది. సెల్‌టవర్ల నుంచి వచ్చే రేడియో తరంగాలు వీటిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

పక్షుల సంఖ్య తగ్గిపోవడం కేవలం ప్రకృతికి జరిగే నష్టం మాత్రమే కాదు, ఇది మానవాళి మనుగడకు కూడా పెను ముప్పుగా మారుతున్నది. పక్షులు, పర్యావరణం మనకు వారసత్వంగా లభించిన సంపద. ఈ సంపదను కాపాడుకోవడం ద్వారానే భవిష్యత్తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించగలం. 'పక్షులను కాపాడటం అంటే, ప్రకృతిని కాపాడటం. ప్రకృతి లేని జీవితం అసంభవం' అని ఎల్డో లియోఫోల్డ్ అంటారు. చిన్నచిన్న చర్యలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నట్లుగా కలెక్టర్, జడ్జి మాదిరిగా, పర్యావరణ పరిరక్షణకు మనం వేసే ఒక్క అడుగే పెద్ద మార్పునకు దారితీస్తుంది.

# దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం!

భక్తితత్పరులు అయినవారు నవవిధ భక్తిమార్గాల ద్వారా దైవాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఈ భక్తి విధానాల్లో దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం హనుమంతుడు. అనంత శక్తులు తనలో దాగి ఉన్నా.. రామబంటుగా ఒదిగి ఉండటమే దాసాంజనేయుడికి ఇష్టం. ఆపరమభక్తుడు పిల్లల దేవుడు, పెద్దల దేవుడు, అందరి దేవుడు. నమ్మిన దైవంపై పరిపూర్ణమైన అంకితభావం కలిగి ఉండాలి. నిరంతరం స్వామి సేవలో తరిస్తూ ఇది తప్ప మరేదీ తనకు అవసరం లేదని ఆంజనేయుడు ప్రార్థించేవాడు. భవబంధచ్ఛిదే తస్యై స్పృహయామి న ముక్తయే భవాన్ ప్రభురహం దాస ఇతి యత విలుప్యతే'ఓ ప్రభూ! ఈభవబంధాల నుంచి నన్ను విముక్తుడిని చేయదలిచితే చేయి. మోక్షాన్ని ప్రసాదించాలనుకుంటే, ప్రసాదించు.కానీ,నేను మాత్రం ఇవేవీ కోరుకోను. మీపై నా దాస్య భావనను మరిపించేదేదీ నాకు అవసరం లేదు' అని వినయంగా వేడుకుంటాడు హనుమ.పురాణాలను అనుసరించి హనుమ చిరంజీవి. నిరంతరం రామనామాన్ని జపిస్తుంటాడు. అంతేకాదు, ఎక్కడైనా రామనామం వినిపిస్తేచాలు.. అక్కడికి వెళ్లిపోతాడు. ఆనందబాష్పాలు నిండిన కండ్లతో, చేతులు జోడించి అక్కడే ఉంటాడు.

రామకథా గానం చేస్తున్న భక్తుల సేవా సంకల్పాన్ని పవనసుతుడు మరింతబలపరుస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి.సురోవసురో వా పృథ వానరో నరఃసర్వాత్మనా యః సుకృతజ్ఞముత్తమమ్‌భజేత రామం మనుజాకృతింహరింయ ఉత్తరాన నయత్కోసలాన్దివమితి (భా



గవతం)' సురులు గానీ, అసురులు గానీ, నరులు గానీ, వానరులు గానీ, మానవమాత్రునిగా ఈ లోకంలో అవతరించిన దేవాదిదేవుడైన ఆ శ్రీరామచంద్ర ప్రభువును ఆరాధించాలి.

భక్తుడు ఆచరించే తృణమాత్రపు సేవనైనా ప్రేమతో స్వీకరించే ఆ స్వామిని సేవించడానికి కఠోరతపస్సులు ఆచరించ అవసరం లేదు. భగవంతుడు ప్రీతి చెందితే, తన భక్తుడికి సార్థకత చేకూరినట్టే. రామచం ద్రుడు అయోధ్య వాసులందరికీ తన స్వధామాన్ని (వైకుంఠాన్ని) అనుగ్రహించాడు' అని పలికిన హనుమంతుడి మాటలు రామభక్తులకు కొండంత బలాన్నిస్తాయి.



# గాడిద బద్ధకం

ఒక ఊరిలో ఓ రైతు పొలం పనులకు గాడిదని ఉపయోగించేవాడు. పొలం దున్నడం, కుప్ప నూర్చడం, పొలం నుండి పంట కళ్లానికి చేర్చడం, ధాన్యం బస్తాలు ఇంటికి చేర్చడం వంటి పనులు అన్నీ ఆ గాడిదతోనే చేయించేవాడు. గాడిదకు తిన్నంత ఆహారం పెట్టేవాడు. దాన్ని ఒక జంతువులా కాకుండా తన ఇంటి సొంత మనిషిలా చూసుకునేవాడు. కాని ఆ గాడిదకు ఒక చెడ్డ అలవాటుంది. దానికి బద్ధకం ఎక్కువ. పని చేయడానికి ఇష్ట పడేదికాదు. ఒక్కోసారి పని తప్పించుకోవటానికి అనారోగ్యంలా నటించేది. రైతుతో సేవలు చేయించుకునేది. ఇలా బాగా బద్ధకానికి అలవాటు పడిన గాడిద, రైతు నుండి ఏ మాత్రం పనిలేని చోటుకి వెళ్లిపోవాలనుకునేది. తగిన సమయం కోసం ఎదురు చూసేది. ఒక రోజు రైతు పొలంలోకి రాజు గారి గుర్రం ఒకటి మేత మేయడానికి వచ్చింది. 'ఆ గుర్రంతో రాజు గారి గుర్రంశాలకు నేను కూడా చేరుకుంటే భలే ఉంటుంది. అక్కడ ఎక్కువ గుర్రాలు ఉంటాయి. అన్ని గుర్రాల మధ్య పని తేలికగా తప్పించుకోవచ్చు. ఆకారంలో నేను కూడా గుర్రం లాగే ఉంటాను కదా!' అనుకుంది. గుర్రంతో మాటలు కలిపింది. 'ఇక్కడ పని ఎక్కువ. ఆహారం అసలు పెట్టడం లేదు. రైతు సరిగా చూసుకో వడం లేదు' అని అబద్దాలు చెప్పి ఏడ్చింది. గుర్రం 'సరే' అంది. సాయంత్రం గుర్రం లాగే తయారై రాజుగారి గుర్రం శాలకు చేరుకుం ది. అక్కడా దాంతో గాడిద చాకిరీ చేయించారు. పైగా రైతు దగ్గర ఉన్నంత స్వేచ్ఛ ఆగుర్రంశాలలో గాడిదకి దొరకలేదు. పైగా కొట్టి మరీ పరుగులు పెట్టిస్తున్నారు. ఆయాసంతో దానికి నీరసం వచ్చే సేది. ఒక రోజు ఆ గుర్రాలశాల నుండి ఎలాగైనా తప్పించుకోవాలని అనుకుంది. కాపరి వచ్చినప్పుడు ఓండ్రించింది. అంతే కాపరి దాన్ని గుర్రాలశాల నుండి తరిమికొట్టాడు. బతుకుజీవుడా అనుకుంటూ గాడిద రైతు పొలం వైపు పరుగు లంకించుకుంది. ఆ రోజు నుండి రైతు చెప్పిన పనులు బుద్ధిగా చేసింది. తప్పిపోయిన తన గాడిద తిరిగి వచ్చినందుకు రైతు కూడా చాలా సంతో షించాడు.




## దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో

# అక్రమ నిర్మాణాల జోరు

- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న కమిషనర్ వెంకట్ రెడ్డి..
- అధికారులకు, సిబ్బందికి అక్రమ నిర్మాణాలే ఆదాయ వనరులు..
- కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహార శైలితో మున్సిపల్ ఆదాయానికి భారీ గండి..!!



**దమ్మాయిగూడ, నవంబర్ 28,(తెలంగాణ దిశ):** అభివృద్ధి జరగాలంటే ఆదాయం కావాలి... కానీ అభివృద్ధి జరిగితే మాకేం వస్తుంది... మా జేబులు నిండితే చాలు... మున్సిపల్ కు ఆదాయం పెంచడం వల్ల మా కడుపు నిండదు కదా... ఇది దమ్మాయి గూడ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది మాత్రం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎంతైనా అధికారుల జేబులు నింపుకునే పనులలో పడిన దమ్మాయిగూడ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ కూడా అండగా నిలవడంత రెండు చేతులా సంపాదిస్తున్నారనడంలో సందేహమే లేదు.? ఎక్కడ అక్రమ నిర్మాణాలు జరిగిన అక్కడికి వాలిపోయి అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా మాకెంత ఇస్తావో చెప్పు లేదంటే చర్యలు తప్పవని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, కమిషనర్, కను సైగల్లో ఎక్కడ చూసినా మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నాయి.

**ఇలాంటి వారిపై చర్యలు తీసుకొని మున్సిపల్ కమిషనర్**

ఆదాయం పెంచేందుకు సహకరించాల్సిన అధికారులు అందుకు భిన్నంగా మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అవినీతి సామ్రాజ్యాన్ని పెంచి పోషిస్తున్నారన్నది నిజం.

మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని, ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో కమిషనర్ అవినీతి దందా హాయిగా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మెయిన్ రోడ్డులలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు సెటిల్ మెంట్ చేసుకుంటన్నరన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు కనుసైగల్లో బారీ అక్రమ నిర్మాణాలు..**

దమ్మాయిగూడ మున్సిపల్‌లో ఆక్రమనిర్మాణాలను కమిషనర్ ప్రోత్సహిస్తూ ఒక్కో నిర్మాణం వద్ద రూ. లక్షల్లో వసూలు చేస్తున్నారనే స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. దీనికి తోడు టిపిఒ, చైన్.మెన్లు తమ వాటాలు పంచుకుంటున్నారని, ఉన్నత అధికారులు కూడా ఇలా మామూళ్లకు అలవాటు పడడం వల్లనే ఆక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అందరూ కాపాడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో స్పెషల్ ఆఫీసర్ అడిషనల్ కలెక్టర్, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అధికారుల అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.



## నాగారం ఉన్నత పాఠశాలలో స్కూల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్




**నాగారం, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :నాగారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిసి రాములు మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శరీర దృఢత్వానికి స్పోర్ట్స్ ఎంతో అవసరమని అన్నారు. పాఠశాల పిడి పాండు రంగారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వనజ రామిరెడ్డి, రాజ్యలక్ష్మి, మాలోత్ సాహెబ్ రఘు వీవీలు ఆల్క స్వప్న, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘనంగా నివాళులు





**ఏఎస్ రావునగర్, నవంబర్ 28, (తెలంగాణ దిశ)** :బహుజన విప్లవాల స్ఫూర్తి ప్రదాతమహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సైనిక్ పురి చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షులు కొత్త అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాకాల రాజు, అజీజ్, పాత కోటి రామలింగం, ఓబీసీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ముదిగొండ లింగస్వామి, శ్రీకాంత్ రెడ్డి, అల్లూరయ్య, బి. నరసింహ, టి. సందీప్ గౌడ్, ఆదినారాయణ, రవి, శ్రీనివాస్, జిఎస్ఎన్ రావు, యాదగిరి రెడ్డి, ఇబ్రహీం, పీరా, అల్లా బక్షి, హుస్సేన్ వల్లి, పద్మ, ఎస్ఎం. ఇబ్రహీం, వివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కశ్మీర్ లో ఎయిర్ ఫీల్డ్

శ్రీనగర్: మనకు పక్కలె బల్లెంలా మారిన పాకిస్తాన్, చైనా తరచూ కవ్వింపు చర్యలతో భారత్‌ను ఇబ్బంది పెడుతున్నాయి. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుండగా, చైనా ఆక్రమణకు తెగబడుతోంది. తరచూ చైనా మ్యాప్‌ను మారుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత్‌భూభాగాన్ని తన భూభాగంగా చూపుతోంది. ఇదే సమయంలో లద్దాఖ్, గాల్వన్ తదితర ప్రాంతాల్లో సైనిక శిబిరాలు ఏర్పాటు చేసి భారత్‌ను బెదిరిస్తోంది. ఈ తరుణంలో చైనాకు చెక్ పెట్టేందుకు భారత సైన్యం కీలక నిర్మాణం చేపట్టింది. అక్టోబర్ నాటికి పూర్తయ్యే ఈ నిర్మాణంతో చైనాపై మన కంట్రోల్ ఉండే అవకాశం ఉంది. లద్దాఖ్‌లోని న్యూమా వద్ద, చైనాతో సరిహద్దు రేఖ(ఎల్ఏసీ)కి కేవలం 35 కిలోమీటర్ల దూరంలో, 13,470 అడుగుల ఎత్తులో నిర్మితమవు తున్న ముద్ ఎయిర్‌ఫీల్డ్ భారత రక్షణ వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. అక్టోబర్ 2025 నాటికి పూర్తయ్యే ఈ ఎయిర్‌ఫీల్డ్, ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్ (ఏఎల్‌జీ)గా గుర్తింపు పొందనుంది. 2.7 కిలోమీటర్ల పొడవైన రన్‌వేతో నిర్మితమవుతున్న ఈ ఎయిర్‌ఫీల్డ్, భారత ఫైటర్ జెట్లు, హెవీ?లిఫ్ట్ ట్రాన్స్‌పోర్ట్ విమానాలు, హెలికాప్టర్లను నిర్వహించగల సామర్థ్యం కలిగి ఉంటుంది. ఈ ఎయిర్‌ఫీల్డ్ వ్యూహాత్మక స్థానం ఉన్నత సాంకేతికత భారత్ సరిహద్దు రక్షణను గణనీయంగా బలోపేతం చేస్తుంది.న్యూమా ఎయిర్‌ఫీల్డ్ లద్దాఖ్‌లోని డేమ్‌చోక్, డెప్సాంగ్, గాల్వ వంటి వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలను రక్షించడంలో ముఖ్యమై న పాత్ర పోషిస్తుంది. 2020లో గాల్వాన్ లోయలో చైనాతో జరిగిన ఘర్షణ తర్వాత, ఈ ప్రాంతంలో సైనిక సన్నద్ధతను పెంచేందుకు భారత్ వేగవంతమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిని చేపట్టింది. డేమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన ఒప్పందాలు ఈ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పునరుద్ధరించాయి. అయినప్పటికీ, న్యూమా ఎయిర్‌ఫీల్డ్ సామీప్యత ఈ ప్రాంతాల్లో ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సైనిక స్పందనను సాధ్యం చేస్తుంది. ఈ ఎయిర్‌ఫీల్డ్ ద్వారా సైనిక సామగ్రి, సిబ్బంది, లాజిస్టిక్ సపోర్ట్‌ను త్వరితగతిన సరఫరా చేయవచ్చు. ఇది చైనా దురాక్రమణలను అడ్డుకోవడంలో కీలకంగా మారుతుంది. 2020 గాల్వన్ ఘర్షణ తర్వాత, భారత్ లద్దాఖ్, నిర్మాణాన్ని వేగవంతం చేసింది. న్యూమా ఎయిర్‌ఫీల్డ్ ఈ వ్యూహాత్మక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో ఒక ముఖ్యమైన భాగం. 2021లో రూ. 214 కోట్ల బడ్జెట్‌తో ఆమోదించబడిన ఈ ప్రాజెక్ట్, కఠినమైన వాతావరణ పరిస్థితులు, తక్కువ ఆక్సిజన్ స్థాయిలు, సవాళ్లతో కూడిన భూభాగంలో నిర్మితమవుతోంది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, కల్నల్ పొనుంగ్ డోమింగ్ నేతృత్వంలో ఈ ప్రాజెక్ట్ 90?95% పూర్తయింది, ఇది భారత్ యొక్క సరిహద్దు రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది.


## ఉక్కు..ఎవరి హక్కు...




**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:** విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు సంబంధించి అదే అస్పష్టత కొనసాగుతోంది. ఒకవైపు ప్రైవేటీకరణ చేయమని చెబుతూ నే.. పెట్టుబడులు ఉపసంహరించుకుంటామనే సంకేతాలు ఇస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఒకవైపు విశాఖ స్టీల్ ఉత్పత్తి పెంచేందుకు గాను భారీగా ఆర్థిక సాయం ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. దీంతో ప్రైవేటీకరణ ఉండదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. కానీ చట్టసభల్లో మాత్రం ప్రైవేటీకరణ తప్ప మరో గత్యంతరం లేదన్నట్లు మాట్లాడుతోంది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ లో విలీనం కూడా అసాధ్యమని చెబుతోంది. ఒకవైపు రాష్ట్రానికి వస్తున్న కేంద్ర ప్రతినిధులు ప్రైవేటీకరణ ఉండదని చెబుతున్నారు. పార్లమెంటుకు వచ్చేసరికి భిన్న ప్రకటనలు చేస్తున్నారు. దీంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగ కార్మికులు. అయితే కేంద్ర ప్రభుత్వం భిన్నంగా వ్యవహరిస్తుండడం ఏమిటన్న ప్రశ్న వినిపిస్తోంది. ఏదైనా నిర్ణయం కరెక్ట్ గా ఉండాలన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశానికి సంబంధించి.. తాము వెనక్కి తగ్గే యోచనలో లేమని విషయాన్ని స్పష్టం చేసింది కేంద్రం. 100% పెట్టుబడుల ఉపసంహరణ ఉంటుందన్న క్యాబినెట్నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం మరోసారి వెల్లడించింది. విశాఖ స్టీల్ ప్లాంట్లో 100% పెట్టుబడుల ఉపసంహరణ చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. స్టీల్ ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చేసే ప్రతిపాదన లేదు. ఇప్పటివరకు ప్లాంట్లో 1017 మంది ఉద్యోగులు టిఆర్ఎస్ కు దరఖాస్తు చేశారు. అదే సమయంలో కేంద్రం అందించే 11 వేల కోట్ల సాయానికి సంబంధించి ఇప్పటివరకు రూ.984 కోట్లు విడుదల చేసినట్లు కూడా మంత్రి తెలిపారు. ఒకవైపు సెయిల్ లో విలీనం లేదని చెబుతున్నారు. పెట్టుబడుల ఉపసంహరణ తప్పదని తేల్చేశారు

## బ్రహ్మోస్ మిస్సైల్‌కు ట్రంప్ భయపడ్డాడా?

### వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికలో సంచలన విషయాలు..!




ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌లోని లక్ష్యాలపై భారత్ బ్రహ్మోస్ క్రూయిజ్ మిస్సైల్స్‌తో దాడి చేసిందని అమెరికాకు నిఘా వర్గాల సమాచారం అందింది. భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమైతే భారత్ బ్రహ్మోస్ మిస్సైళ్లలో అణ్వాయుధాలను అమర్చవచ్చని అమెరికా ఆందోళనకు గురైనట్లుగా వాల్ స్ట్రీట్ జర్నల్ (%ఔజీ%) నివేదిక పేర్కొంది. ఈ మిస్సైల్స్‌కు అణ్వాయుధాలను జోడిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ట్రంప్ జరిపాలన భయపడిందని, బ్రహ్మోస్ క్షిపణికి న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను మోసుకువెళ్లే సామర్థ్యం ఉందని అమెరికా నిఘా సంస్థలు భావించాయని, ట్రంప్ పరిపాలనలోని ప్రస్తుత, మాజీ అధికారులు సైతం చెప్పినట్లుగా నివేదిక పేర్కొంది. పరిస్థితి మరింత దిగజారితే భారతదేశం ఈ క్షిపణులకు అణ్వాయుధాలను జోడించవచ్చని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆందోళనకు గురయ్యారని.. దాంతో పాకిస్తాన్ సైతం అణ్వాయుధాలతో దాడి చేయవచ్చని భావించారని.. ఈ భయం కారణంగానే వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలను భారత్, పాక్ నేతలతో మాట్లాడాలని కోరినట్లు నివేదిక తెలిపింది. బ్రహ్మోస్ క్షిపణిలో సాంప్రదాయ (అణ్వాయుధేతర) ఆయుధాలు మాత్రమే ఉన్నాయని భారత్ గతంలో ఎన్నోసార్లు క్లారిటీ చేసింది. వాటిని భారత సైన్యం ఆర్టిలరీ రెజిమెంట్, వైమానిక దళం, నౌకాదళం మాత్రమే మిస్సైల్స్‌ని నిర్వహిస్తున్నాయి. అణ్వాయుధాలను మోసుకెళ్లగల క్షిపణులు స్ట్రాటజిక్ ఫోర్స్ కమాండ్ నియంత్రణలో ఉన్నాయి. బ్రహ్మోస్ క్షిపణిలో 200 నుంచి 300 కిలోల సాంప్రదాయ పేలుడు పదార్థాలను అమర్చవచ్చు. ఈ క్షిపణి చాలా ఖచ్చితత్వంతో వేగంగా దాడి చేయగలదు. వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రకారం.. భారతదేశం-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత అణు యుద్ధంగా మారవచ్చని ట్రంప్ ఆందోళన చెందారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, అమెరికా నేరుగా జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని వైట్ హౌస్ భావించింది. ట్రంప్ తన వ్యక్తిగత సంబంధాలను ఉపయోగించి భారతదేశం, పాకిస్తాన్ నాయకులతో మాట్లాడి సంక్షోభాన్ని నివారించడానికి ప్రయత్నించారని వైట్ హౌస్ అధికారి ఒకరు చెప్పినట్లు నివేదిక పేర్కొంది. అయితే, బ్రహ్మోస్‌ని ప్రయోగించడం వల్లే భయపడ్డారా? లేదా? అన్నది ఆ అధికారి చెప్పలేదని నివేదికతెలిపింది. వాల్ స్ట్రీట్ జర్నల్ వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని ప్రశ్నించిన సమయంలో.. భారత్ 'మొదట ఉపయోగించకూడదు' అంటే తొలుత అణు దాడి చేయకూడదు అనే విధానాన్ని అనుసరిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. మే పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణ సమయంలో, భారతదేశం బ్రహ్మోస్ క్షిపణులతో అనేక కీలకమైన పాకిస్తాన్ సైనిక స్థావరాలపై దాడి చేసిందని ఆ నివేదిక పేర్కొంది. వీటిలో వైమానిక దళ రన్‌వేలు, బంకర్లు, హ్యాంగర్లు ఉన్నాయి. బ్రహ్మోస్ క్షిపణిని భారతదేశ బ్రహ్మపుత్ర నది, రష్యా యొక్క మోస్క్వా నది పేర్లను కలిపి పెట్టారు. ప్రపంచంలోని ఏకైక సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి. గంటకు 3450 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది. ఈ క్షిపణిని 1998లో ప్రారంభమైన వ్యూహాత్మక భాగస్వామ్యంలో భారత్‌కు చెందిన డీఆర్డీవో, రష్యాకు చెందిన ఎన్‌పీవో మాషినోస్ట్రోయెనియా సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఇప్పుడు భారతదేశంలో ఉత్పత్తి చేస్తున్నారు. శత్రు నౌకలపై దాడి చేయడం, భూమి, తీరప్రాంత భద్రతను లక్ష్యంగా చేసుకోవడం వంటి వివిధ ప్రయోజనాల కోసం నావికాదళం, వైమానిక దళం, సైన్యం ఉపయోగిస్తున్నాయి. బ్రహ్మోస్‌ను అడ్డుకోవడం చాలా కష్టమే. ఇందులో రెండు ఇంజిన్లు ఉంటాయి. తొలి దశలో ఘన ఇంధన బూస్టర్ మిస్సైల్ వేగంగా వెళ్లేలా చేస్తుంది. ఆ తర్వాత రామ్‌జెట్ ఇంజిన్ క్రూయిజ్ దశలో పని చేస్తుంది. చాలా త్వరగా దిశను మార్చుకోవడంతో పాటు శత్రువుల రాడార్‌లను తప్పించుకొని దాడి చేస్తుంది.

# ట్రంపు దెబ్బకు రొయ్యల రైతు కుదేలు



**- అమెరికా సుంకాల పెంపుతో తగ్గిన ధరలు**

**- పంట చేతికొచ్చే దశలో కోలుకోలేని దెబ్బ**

**- ఆక్వా రంగంపై ప్రభావం ఉంటుందన్న సిఎం చంద్రబాబు**

**ఒంగోలు,తెలంగాణ దిశ :** మన దేశం నుంచి అమెరికాకు రొయ్యలు ఎగుమతి అవుతుండడంతో అక్కడ ఏ నిర్ణయం తీసుకున్నా ఇక్కడ ఈ తీవ్ర ప్రభావం పడుతోంది. అమెరికా అధ్యక్షులు ట్రంప్ భారత్‌ను రష్యాతో వాణిజ్యంపై హెచ్చరిస్తూ సుంకాల పెంపును ప్రకటించారు. తొలుత 25 శాతం సుంకం విధించారు. ఆ తర్వాత మరో 25 శాతం కూడా విధించారు. దీంతో, సుంకం 50 శాతానికి చేరింది. దీంతో, రెండు, మూడు రోజుల్లోనే రొయ్యలు పతనమయ్యాయి. ట్రంప్ ప్రకటనను అడ్డుపెట్టుకొని కూడా వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని రైతులు చెబుతున్నారు. పంట చేతికి వచ్చే దశలో ఈ పరిణామాలతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నెల రెండున 'అన్నదాతా-సుఖీభవ' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా దర్శి వచ్చిన సిఎం చంద్రబాబు కూడా ట్రంప్ సుంకాల పెంపు ప్రభావం ఆక్వా రంగంపై పడుతుందని చెప్పారు. ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి. ఎగుమతులపైనా ఆంక్షలు, ప్రభావం ఉండడంతో మొత్తంగా ఆక్వా రంగం సంక్షోభంలో పడింది.

ధరల పతనం ఇలా: ఇటీవల వరకూ 20 కౌంట్ రొయ్యల ధర కిలో రూ.640 ఉండగా, ఇప్పుడు రూ.590కు పడిపోయింది. 30 కౌంట్ ధర రూ.470, 40 కౌంట్ ధర రూ.380 ఉంది. వీటి ధర సగటున కిలోకు ధర రూ.40 పతనమైంది. ఈ లెక్కన టన్నుకు రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లుతోంది. వెనామీ రొయ్య వంద కౌంట్ రూ.240 నుంచి రూ.220కు పడిపోయింది.

ఎగుమతుల్లో 20 శాతమే అమెరికాకు..: రాష్ట్రం నుంచి రొయ్యలు అమెరికాకు 20 నుంచి 30 శాతం ఎగుమతి అవుతుంటాయని చినగంజాం ప్రాంత ఆక్వా రైతు మద్దినేని శ్రీనివాసరావు తెలిపారు. ఎక్కువగా శాతం చైనా, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా ప్రభావమే ఎక్కువగా ఎగుమతులపై ఉంటుందని చెబుతున్నారు. రొయ్యలను దేశీయ వినియోగం తక్కువగా ఉంది. రెస్టారెంట్లలోనూ వీటిని తక్కువగా వినియోగిస్తున్నారు. ఆక్వా కంపెనీలు కూడా రొయ్యలను విదేశాలకు ఎగుమతిపైనే దృష్టి పెడుతున్నాయి. శింగరాయకొండ వద్ద ఉన్న భారీ ప్రాసెసింగు కంపెనీలు ఎగుమతులపైనే నడుస్తున్నాయి.

నిలిచిన ఎగుమతులు: ఒక కంటైనర్‌లో 16 టన్నులు ఎగుమతి అవుతుంటాయి. దీని విలువ సుమారు రూ.1.28 కోట్ల వరకూ ఉంటుంది. గతంలో ఐదు శాతం ట్యాక్స్ ప్రకారం ఎగుమతిదారులు రూ.6.40 లక్షలు కట్టేవారు. సుంకం 50 శాతానికి పెంపు వల్ల ఇప్పుడు రూ.64 లక్షలు కట్టాలి. దీంతో, ఎగుమతులు నిలిచిపోయాయి. తక్కువ కౌంట్ రొయ్యలను స్థానిక రెస్టారెంట్లు, మార్కెట్లలో అమ్మకాలు చేస్తే ధరలు హెచ్చుతగ్గుల సమయాల్లో నష్టం తగ్గే వీలుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కోస్తా ప్రాంతంలో ఆయువుపట్టుగా ఆక్వా సాగు:**

ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లోనే కాకుండా కోస్తా జిల్లాల్లో ఆక్వా సాగు ఆయువు పట్టుగా, తీర ప్రాంత ఆర్థికాభివృద్ధికి కీలకంగా ఉంది. మధ్యతరగతి రైతులతోపాటు కంపెనీలు, రాజకీయ నేతలూ ఈ సాగులో ఉన్నారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో వేటపాలెం, చినగంజాం, నాగులుప్పలపాడు, ఒంగోలు, కొత్తపట్నం, సింగరాయకొండ, ఉలవపాడు తదితర మండలాల్లో సుమారు 12,500 ఎకరాల్లోపైగా ఆక్వా సాగు ఉంది. వెనామీ, టైగర్ రొయ్యలను సాగు చేస్తున్నారు. రొయ్యల చెరువుల్లో సాగు చేసే వాటిలో 90 శాతం విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

# పెరుగుతున్న దూరం...



**గుంటూరు,తెలంగాణ దిశ:**ఏపీలో అధికారం పోయిన తర్వాత బీజేపీకి దగ్గరయ్యేందుకు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు మాజీ సీఎం జగన్.బెంగుళూరు వేదికగా అక్కడి నేతల ద్వారా తనవంతు ప్రయత్నాలు చేశారు. ఈ విషయంలో బీజేపీ నుంచి ఎలాంటి సంకేతాలు రాలేదు. దీంతో జగన్ జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. దాని ద్వారా బల ప్రదర్శన చేశారు. జగన్‌కు మద్దతుగా ఉండే ఏపీలో కొందరు బీజేపీ నేతలు హైకమాండ్‌కి దృష్టికి పంపించినట్టు సమాచారం. ఎన్నికల్లో ఓడినా, మాజీ సీఎంకు ప్రజల్లో ఆదరణ ఉందన్నది అందులోని సారాంశం. ఈ విషయం లో కమలనాథుల నుంచి ఎలాంటి సంకేతాలు వచ్చేయో తెలీదు. మంత్రి సత్యకుమార్ ఎదురుదాడి చూసి షాకయ్యారు వైసీపీ నేతలు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలకు కౌంటరిస్తున్నారు టీడీపీ-జనసేన నేతలు. కానీ బీజేపీ నుంచి ఎలాంటి కౌంటర్లు పడలేదు. హైకమాండ్ సంకేతాలు ఏమో తెలీదుగానీ మంత్రి సత్యకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్య కుంభకోణం సూత్రధారి జగన్ అరెస్టు కానున్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు కూటమి ఏడాది పాలనపై చర్చకు సిద్ధమేనంటూ ఎటాకింగ్ మొదలుపెట్టారు. ఉన్నట్లుండి మంత్రి సత్యకుమార్ కామెంట్స్‌పై వైసీపీలో అప్పుడే చర్చ మొదలైంది. మంత్రి మాటల వెనుక బీజేపీ హైకమాండ్ ఉండవచ్చని అంటున్నారు. అందువల్లే నేరుగా లిక్కర్ స్కామ్‌లో జగన్ అరెస్టు కావడం ఖాయమని ఓపెన్‌గా చెప్పారని అంటున్నారు. మంత్రి సత్యకుమార్ గురించి చెప్పనక్కర్లేదు. హోంమంత్రి అమిత్ షాకు సత్యకుమార్ నమ్మినబంటుగా చెబుతారు ఆ పార్టీ నేతలు. సమయం, సందర్భం వచ్చినప్పుడు ఆఫ్ ద రికార్డులో చెబుతుంటారు. అందువల్లే మొన్నటి ఎన్నికల్లో ఆయన ధర్మవరం నుంచి గెలవడం, ఆ తర్వాత చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి కావడం చకచకా జరిగిపోయిందని అంటున్నారు. దీనికితోడు లిక్కర్ కేసు వ్యవహారం వైసీపీని కకావికలం చేసింది. దాని మూలాలు ఏకంగా అధినేత మెడకు చుట్టుకున్నాయి. జరిగిన.. జరుగుతున్న పరిణామాలను గమనించిన బీజేపీ పెద్దలు మంత్రి సత్యకుమార్ ద్వారా ఎదురుదాడికి దిగేలా చేశాయని అనుకుంటున్నారు వైసీపీ నేతలు. ఈ లెక్కన వైసీపీకి కమలం నుంచి కష్టాలు తప్పవని అంటున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఏం జరుగుతుందో చూడాలి.

# మళ్లీ జిల్లాల పునరవ్యవస్థీకరణ

**అనంతపురం,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు..జిల్లాలు సరిహద్దులు, పేర్లు మార్పు.. మండలాల మార్పులు, చేర్పు లపై కసరత్తు చేస్తోంది. ఇటీవల ఏడుగురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో అనగాని సత్యప్ర సాద్, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకు మార్ యాదవ్, పి.నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి లు సభ్యులుగా ఉన్నారు. తాజాగా కేబినెట్ భేటీలో జిల్లాలకు సంబం ధించిన అంశాలన్ని చంద్రబాబు ప్రస్తావించారు. ఈ మేరకు నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆ కేబినెట్ సబ్ కమిటీని ఆదేశిం చారు.ఈ మేరకు జిల్లాల పేర్ల మార్పు, ప్రధాన కేంద్రాలు, డివిజన్‌లు, సరిహద్దులు, మండలాల అంశంపై కమిటీ పరిశీలన ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారట. అలసు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారా అని అడిగారట. కొత్త జిల్లాల ఏర్పాటులో గత ప్రభు త్వం కొన్ని తప్పులు చేసిందన్న చంద్రబాబు.. వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారట. ఉపసంఘం సమావేశం అవుతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ సీఎంకు వివరించారట. అయితే డిసెంబర్ నాటికి ఈ సమస్యల్ని ఓ కొలిక్కి రావాలని ఆలస్యం చేయొద్దని సూచించారట. ఈ ఉప సంఘం జిల్లాల పేర్ల మార్పు, సరిహద్దుల మార్పు, ప్రధాన కార్యాలయాల మార్పు వంటి అంశాలను పరిశీలిస్తుంది. వీటితో పాటుగా డివిజన్లు, మండలాల అంశాలను కూడా పరిశీలిస్తుంది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కూడా ఉపసంఘం పరిశీలించి నివేదికను తయారు చేయనుంది.ఏపీలో పలు కొత్త జిల్లాల ఏర్పాటు, పేర్లు మార్పు, జిల్లాలు, మండలాలకు సంబంధించిన డిమాండ్‌లు తెరపైకి వచ్చాయి. ప్రధానంగా ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంతాన్ని మార్కాపురం కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ గత ఐదేళ్లుగా వినిపిస్తోంది. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలో కూడా చంద్రబాబు కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. యర్రగొండపాలెం, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాలు కలిపి జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఈ అంశం కూడా ప్రస్తుతం తెరపైకి వచ్చింది. అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటి కాకుండా రాజంపేట ప్రధాన కేంద్రంగా ఉండాలనే డిమాండ్ వినిపిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాకు నర్సాపురాన్ని ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.. కానీ భీమవరాన్ని పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించారు. ఇటు శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని ప్రజలు అడుగుతున్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా ఇదే డిమాండ్ వినిపిస్తున్నారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కేంద్రంగా పుట్టపర్తి ఉంది.కొత్త 26 జిల్లాల్లో ఒక గిరిజన జిల్లా ఉంటుందని చెప్పిన గత ప్రభుత్వం.. రెండు జిల్లాలను ప్రకటించింది. పాడేరు ప్రధాన కేంద్రం అల్లూరి సీతారామరాజు.. పార్వతీపురం ప్రధాన కేంద్రంగా మన్యం జిల్లా ఏర్పాటైంది. అయితే మన్యం జిల్లా పేరు మార్చాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. రెవెన్యూ డివిజన్ల విభజనపై కూడా వినతులు వస్తు?న్నాయి. వీటితో పాటుగా పలు రెవెన్యూ డివిజన్లు, మండలాల అంశాలు కూడా తెరపైకి వచ్చాయి.. వాటిని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# హైదారాబాద్ లోనే ఇంకా ఏపీ ఆఫీసులు!

**అమరావతి,తెలంగాణ దిశ:**: రాష్ట్ర విభజన జరిగి 11 సంవత్సరాలు దాటుతోంది. కానీఇంతవరకు విభజన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. సమస్యలు పరిష్కరించడం లేదు. రాజకీయ భిన్న ప్రభుత్వాలు, విభేదించే నాయకుల పుణ్యమా అని విభజన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా తెలంగాణ నుంచి ఏపీకి రావాల్సిన రెండు కార్యాలయాల జాడలేదు. దీంతో ఏపీ ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ప్రధానంగా ఆధార ప్రాంతీయ కార్యాలయం, జనాభా లెక్కల సేకరణ కార్యాలయం ఇప్పటికీ తెలంగాణ నుంచి పనిచేస్తున్నాయి. దీంతో ఏ చిన్న సమస్యకు పరిష్కారం కావాలన్నా.. హైదరాబాదులోని ప్రాంతీయ కార్యాలయాలకు సంప్రదించాల్సి వస్తోంది. అసలు ఈ కార్యాలయాలు ఏపీలో కార్యకలాపాలు ప్రారం భించేలా చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపి స్తున్నాయి.ఆ వచ్చేఏడాది ద్వితీయార్థంలో జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే జనాభా లెక్కల సేకరణ కార్యాల యం తెలంగాణ నుంచే పని చేస్తుంది.ఏపీ జనగణన ఆపరేషన్ డైరెక్టర్గా ఐఏఎస్ అధికారి నివాస్‌ను నియమిస్తూ జూలై 16న కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. అందులోనూ హైదరాబాద్ కేంద్రంగా పనిచేయాలని నిర్దేశించింది రాష్ట్ర విభజ జరిగినా.. ఏపీ మాత్రం దేశంలో పెద్ద రాష్ట్రంగానే ఉంది. విభజన హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఏపీకి తరలించాల్సి ఉంది. 11 ఏళ్లు గడుస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రం ఏపీ వైపు చూడడం లేదు. దానికి కారణం లేకపోలేదు. ఏపీకి రాజధాని లేకపోవడమే ప్రధాన కారణం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల జనాభా గణన కార్యాలయాలకు సొంత వెబ్ సైట్లు ఉన్నాయి. అందులో ఆయా రాష్ట్రాలు, జిల్లాల వారిగా జనాభా లెక్కల వివరాలు, గెజిట్ నోటిఫికేషన్లు ఉంటాయి. మన పక్కనే ఉన్న తమిళనాడు, ఒడిస్సా, కర్ణాటక కార్యాలయాలకు సైతం వెబ్సైట్లు ఉన్నాయి. తెలంగాణలో కొనసాగుతున్న ఏపీకి సంబంధించిన కార్యాలయానికి మాత్రం సొంత వెబ్సైట్ లేదు. ఇది ముమ్మాటికి ఇబ్బందికరమే.ప్రస్తుతం దేశ పౌరుడికి గుర్తింపు ఆధార్ విశిష్ట ప్రాధికార పత్రంగా దానికి గుర్తింపు ఉంది.

అయితే ఆధార్ వ్యవహారాలను పర్యవేక్షించే యుఐడిఏఐ ప్రాంతీయ కార్యాలయం కూడా ఏపీలో లేదు. ఏపీకి సంబంధించిన ప్రాంతీయ కార్యాలయం హైదరాబాదులో కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా యుఐడిఏఐ కి ఎనిమిది ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. ప్రజల సౌలభ్యం కోసం ఆర్వోల పరిధిలో రాష్ట్ర కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో ఏర్పాటైన ఈ కార్యాలయం.. ఏపీలో మాత్రం లేదు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా హైదరాబాదులోని అధికారులనే సంప్రదించాలి. ఫోన్ చేసి అడిగితే అధికారులు అందుబాటులో లేరనే సమాధానం వస్తుంటుంది. దీంతో ప్రజలు చాలా అసౌకర్యానికి గురవుతున్నారు.

# ట్రబుల్ షూటర్ కోసం.. హైరానా!

**నెల్లూరు,తెలంగాణ దిశ:** విజయసాయి రెడ్డి విషయంలో జగన్ ఎటూ తేల్చుకోలేక పోతున్నారా? వైసీపీలోకి రీఎంట్రీ కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేకపోతున్నారా? అసలు వైసీపీ అధినేత మదిలో ఏముంది? సాయి రెడ్డి విషయంలో ఎలాంటి ఆలోచనతో ఉన్నారు? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పునాది నుంచి ఉన్నారు విజయసాయిరెడ్డి. అధినేత కష్టసుఖాల్లో సైతం పాలుపంచుకు న్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అహర్నిశలు శ్రమించారు. అటువంటి నేత ఇటీవల పార్టీకి దూరమ య్యారు. ఇంతవరకు ఏ పార్టీలో కూడా చేరలేదు. అయితే ఇప్పుడు విజయసాయిరెడ్డిని పార్టీలోకి రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నా యని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా అటు విజయసాయి రెడ్డికి, ఇటు జగన్మోహన్ రెడ్డికి మధ్య సన్నిహితంగా ఉన్న రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. అయితే విజయసాయిరెడ్డి పై కొంతమంది నేతల అభ్యంతరం ఉండడంతోనే జగన్ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందన్న ప్రచారం నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంలో విజయసాయిరెడ్డి పాత్ర స్పష్టంగా ఉంది. సాయి రెడ్డి వైయస్సార్ కుటుంబ ఆడిటర్ గా ఉండేవారు. అలా జగన్మోహన్ రెడ్డికి దగ్గరయ్యారు. జగన్ తో పార్టీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొ న్నారు. అవినీతి కేసుల్లో 16 నెలల పాటు జైలు జీవితం అనుభవించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటుకు బీజం వేసింది విజయసాయిరెడ్డి అని అప్పట్లో టాక్ నడిచింది. అందుకు తగ్గట్టుగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడ్డారు విజయసాయిరెడ్డి. తొలిసారి పార్టీ అధికారంలోకి రాకపోయినా.. ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా.. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేసి.. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కారణమయ్యారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తన హవాను చెలాయించారు. అయితే ఈ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒక ప్రత్యేక పరిస్థితుల్లో బయటకు వెళ్లారు విజయసాయిరెడ్డి.అయితే ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. పార్టీకి దారుణ పరాజయం ఎదురయింది. కూటమి ప్రభుత్వ ఉక్కు పాదం మోపుతోంది. జగన్ చుట్టూ ఉన్న నేతలంతా అరెస్టు అయ్యారు. రాష్ట్రంలో ఇతర పార్టీల నుంచి సహకారం లేదు. జాతీయ స్థాయిలో సైతం మద్దతు తెలిపేవారు కరువయ్యారు.

జాతీయ పార్టీలతో లాబీయింగ్ చేసే నేత కూడా కనిపించకుండా పోయారు. విజయసాయిరెడ్డి లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే విషయాన్ని జగన్ మోహన్ రెడ్డి సన్నిహిత నేత ఆయనకు గుర్తు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలోకి విజయసా యిరెడ్డిని తీసుకొస్తే మంచిదని ఆయన సలహా ఇచ్చినట్లు సమాచారం. అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం ఈ విషయంపై ఏమీ మాట్లాడలేదని తెలుస్తోంది. అయితే ఏదైనా విషయాన్ని ముఖం మీద తేల్చేయడం జగన్ కు ఉన్న అలవాటు. దీంతో విజయసాయిరెడ్డి విషయంలో ఆలోచన చేస్తున్నట్లు అర్థమవుతోంది.అయితే విజయసాయిరెడ్డి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని చాలామంది నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కాకినాడ సి పోర్టు కేసు విచారణకు హాజరైన ఆయన మాట్లాడిన తర్వాతే.. మద్యం కుంభకోణం కేసులో సిట్ చర్యలను వేగవంతం చేసింది. నేతల అరెస్టు ప్రారంభమైంది. కేవలం విజయసాయిరెడ్డి ఇచ్చిన సమాచారంతోనే ప్రత్యేక దర్యాప్తు బృందం పట్టు బిగించిందన్న అనుమానాలు ఉన్నాయి. అటువంటి నేతను ఎలా పార్టీలోకి తీసుకుంటారని చాలామంది అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే జగన్మోహన్ రెడ్డి విజయసాయిరెడ్డి విషయంలో ఎలా అడుగు ముందుకు వేయాలో తెలియడం లేదు. అందుకే తన నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు ప్రచారం నడుస్తోంది. మొత్తానికి అయితే పరిస్థితులు చూస్తుంటే విజయసాయిరెడ్డి వైసీపీలోకి రీఎంట్రీ ఖాయమని తెలుస్తోంది.

# ట్రంప్ విపరీత ధోరణలకు సవాల్ విసరాలి

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** ట్రంప్ విపరీత ధోరణి ప్రపంచానికి పెను సవాల్ కానుంది. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు చూస్తుంటే అమెరికాకు గులాంగిరీ చేయాలన్న ధోరణి కనిపిస్తోంది. వివిధ దేశాలపై అక్కసు వెళ్లగక్కడం, విపరీతంగా సుంకాలు విధించడం, మేం చెప్పినట్లు గానే నడచుకోవాలనడం, ఫలానాదేశంతో వాణిజ్యం చేయవద్దు, అమెరికా వచ్చే విద్యార్థులపై ఆంక్షలు పెట్టడం వంటివన్నీ పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయి. ఇంత దారుణంగా గతంలో ఏ రాజ్యాధినేతా వ్యవహరించలేదు. ఎవరు ఎవరితో వ్యాపార్యం చేయాలో నిర్ణయించ డానికి ట్రంప్ ఎవరు. మార్కెట్లో సరుకులు ఎక్కడ కొనాలన్నది ట్రంప్ ఆదేశిస్తే ఎలా? ఏ దేశమైనా తాను ఉత్పత్తి చేసే సరుకులను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తుంది. తనకు అవసరమైన వస్తువులను అనువైన ధరలకు ఇచ్చే దేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. వ్యాపారా, వాణిజ్య పరంగా ఆయా దేశాలకు ఉన్న స్వేచ్ఛ ఇది. ఎక్కడి నుంచి ఎంతకు కొనాలో, సుంకాలు ఎంతెంత ఉండాలో ఏ దేశమూ ఏకపక్షంగా నిర్ణయి ంచజాలదు. అమెరికా ఆధిపత్య ధోరణి ఈ ప్రాథమిక నియమానికి భిన్నంగా ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే రష్యా అత్యంత చౌకగా ముడి చమురు, సహజ వాయువును సరఫరా చేస్తోంది. భారత్, చైనా తమ అవసరాలకు రష్యా నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అమెరికా అనుంగు ఆయిల్ కంపెనీలకు ఇది నష్టదాయకంగా పరిణమించి ఉండవచ్చు.

దీంతో, రష్యాతో ఎలాంటి వాణిజ్య లావాదేవీలు జరిపినా ఊరుకునేది లేదని నెలరోజుల క్రితం అమెరికా హూంకరించింది. అమెరికా బెదరింపులకు అనుకూలంగా తలూపితే మన వ్యవసాయ, పాడి పరిశ్రమ రంగాలకు తీవ్రమైన నష్టం జరుగుతుంది. పెట్రో ధరలు పెచ్చు పెరిగి, నిత్యావసరాలపైనా ఆ భారం పడుతుంది. ఇప్పటికే నిరుద్యోగం, అల్పాదాయాలు, అధిక ధరలతో సతమతమవుతున్న దేశ ప్రజానీకానికి ఇది మరింత దుర్భర స్థితిని కలిగిస్తుంది. కాబట్టి మోడీ ప్రభుత్వం దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టేలా అమెరికాకు గట్టి సమాధానం చెప్పాలి. దేశ ప్రగతికి, ప్రజలకు నష్టం కలిగించే వాణిజ్య ఒప్పందాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. నష్టదాయక ఒప్పందాలకు లొంగకుండా గొంతెత్తాలి! అమెరికాను బ్యాన్ చేసే దాకా పోరాడాలి. ఇదే సందర్భంలో నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే కూడా తీవ్రమైన పరిభాషతో మన దేశాన్ని హెచ్చరించాడు.

రష్యాతో వాణిజ్య వ్యాపారాలను వెంటనే నిలిపేయాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని బెదిరింపులకు తెగించాడు. ఒక సర్వ సత్తాక స్వతంత్ర దేశాన్ని ఇలా బెదిరించటానికి అతడికున్న హక్కు ఏమిటి. ఇలాంటి పెడ ధోరణులను సహించడం సరికాదు. ఆదిలోనే తుంచేయాలి. అంతేనా అంటే మనతో శత్రుత్వం పెంచుకున్న పాక్‌ను చేరదీయడం, దానికి ఆయుధ సంపత్తిని, ఆయిల్‌ను పంపడం, ఆర్థిక సాయం చేయడం పాముకు పాలు పోసి పెంచడం తప్ప మరోటి కాదు. అమెరికాలో ట్విన్ టవర్స్ కూల్చివేతను ట్రంప్ మరచినట్టు ఉన్నాడు.

పాక్‌ను పెంచి పోషిస్తున్న ట్రంప్‌కు గుణపాటం తప్పదు. ఒకపక్క మోడీ తానే ట్రంప్‌కు ప్రియమైన మిత్రుడైనట్టు పోజులిస్తుంటే- అమెరికా నుంచిఈతరహా పరోక్ష, ప్రత్యక్ష అదిలిం పులూ, ఒత్తిళ్లలో అర్థమేమిటన్న ది విశ్వేషించాలి. ఇలాంటి ధోరణులపై భారత్ తక్షణం స్పందించాలి. ఆధిపత్య ధోరణికి అహంకారమూ, అరాచకమూ తోడైతే ఎలా ఉంటుందో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీరుతెన్నులను పరికిస్తే అర్థమవుతుంది. ట్రంప్‌ను మోసిన ఎలాన్ మస్క్‌నే మోసం చేసిన ఘనుడు ట్రంప్. ఎన్నికల ముందు మస్క్‌తో దోస్తానా కట్టి డబ్బులు ఖర్చు పెట్టించి ఇప్పుడు మస్క్‌కే మస్కా కొట్టాడంటే ట్రంప్ ఎంతటి ద్రోహియో అర్థం చేసుకోవాలి.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన



**మంథని,తెలంగాణ దిశ:** మంథని మండలం గాజులపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించగా ప్రజల నుండి భారీ స్పందన లభించింది. శ్రీ వైద్యఫౌండేషన్ సహకారంతో గ్రామస్తులకు షుగర్, బీపీ రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. అలాగే కరీంనగర్ సన్ రైస్ ఆసుపత్రి వైద్య సిబ్బంది డాక్టర్ మేఘన గ్రామస్తులకు ఉచితంగా గుండె పరీక్షలు చేసి అవసరం ఉన్నవారికి ఉచిత మందుల పంపిణీ చేశారు.మంథనిలోని పటేల్ ఐ కేర్ ఆస్పత్రి వారు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తామని పేర్కొన్నారు. నిరుపేద ప్రజల ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న, శ్రీ వైద్య ఫౌండేషన్, అలాగే సన్ రైస్ ఆసుపత్రియాజమాన్యానికిమాజీ సర్పంచ్ సుధాకర్ మరియు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో శ్రీ వైద్య ఫౌండేషన్ చైర్మన్ బుద్ధార్తిసతీష్ కుమార్,సన్ రైస్ ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ రాజేందర్,మార్కెటింగ్ ఎక్స్యూటివ్ తిరుపతి, డాక్టర్ మేఘన, ఆసుపత్రి మార్కెటింగ్ కోఆర్డినేటర్స్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఎకో పార్క్.. ఇంకెప్పుడో?



**బీఆర్ఎస్ హయాంలోనే పనులన్నీ పూర్తి**
**కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోలేదు**
**రెండేండ్లుగా నాన్చుతున్న రేవంత్ సర్కార్**

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పనులు దేవుడెరుగు, కనీసం పూర్తైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించడం లేదు. హైదరాబాద్ పర్యాటకానికే తలమానికమైన కొత్వాల్‌గూడ ఎకో పార్క్ పనులన్నీ పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలోనే పనులు చేపట్టి 75 శాతానికి పైగా పూర్తి చేసింది. 25 శాతం పనులు పెండింగ్‌లో ఉండగా%ా% ఎన్నికల కారణంగా నిలిచిపోయాయి. అయితే రేవంత్ సర్కార్ ఏర్పాటై రెండేండ్లు గడిచినా.. ప్రాజెక్టుల పురోగతిపై కనీసం ఒక్క సమీక్ష కూడా చేయలేదు. అధునాతన టూరిజం వేదికగా కొత్వాల్‌గూడను మార్చేలా 2022లో ఈ ప్రాజెక్టు ప్రారంభమైంది. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయడంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేయడంతో ఎప్పుడో అందుబాటులోకి రావాల్సిన కొత్వాల్‌గూడ ఎకో పార్క్ నేటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. పచ్చని పరి సరాలు, అతిపెద్ద పక్షిశాలతో వినోద కేంద్రంగా మారే కొత్వాల్‌గూడ ఎకో పార్క్ అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. ఐవరీ, బోర్డు వాక్స్, ల్యాండ్ స్కేపింగ్, వీకెండ్ క్యాపింగ్ వంటి సదుపాయాలతో ఈ ప్రాంతానికి పర్యాటకుల తాకిడి పెర గనున్నది. కానీ ఎంతసేపు కొత్త ప్రాజెక్టులు ప్రకటించడం, ప్రతిపాద నల పేరిట కాలయాపన చేయడమే కాంగ్రెస్ తీరు అన్నట్లుగా వ్య వహరిస్తున్నది. 100 ఎకరాల విస్తీర్ణంలో ఎకో పార్క్‌ను మూడేళ్ల కిందట హెచ్ఎండీఏ చేపట్టింది. పార్క్‌తోపాటు వరల్డ్ క్లాస్ టూరిజం అనుభూతిని కలిగించేలా అక్వేరియం, పక్షిశాలతోపాటు, జంట జలాశయాలను చూసేందుకు వీలుగా లొకేషన్ స్పాట్లను కూడా అభివృద్ధి చేసింది. కానీ ప్రభుత్వ పెద్దల అలసత్వంతో పనులు నత్తనడనకన సాగడంతో ఇప్పటికీ ప్రారంభోత్స వానికి నోచుకోవడం లేదు. అధునాతన టూరిజం వసతులు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే.. విదేశీ టూరిస్టులను ఆకట్టుకుంటుంది. ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎంట్రెన్స్ ఆర్చి, ఓపెన్ ప్లాజా, అప్రోచ్ రోడ్డు, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ సౌకర్యాలతోపాటు 8వేలకు పైగా విదేశీ పక్షులతో అద్భుతమైన పక్షి కేంద్రాన్ని కలిగి ఉంది.సందర్శకులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, బల్లలను బిగించారు. కోటిన్నర అంచనా వ్యయంతో పార్కు పరిధిలో పనులను హెచ్ఎండీఏ పూర్తి చేసింది. మహానగర జంట జలాశయాలకు స మీపంలోఉండటంతో ఇదొక వీకెండ్ ఫ్యామిలీ ఎకో టూరిజం స్పా ట్‌గామారనున్నది. రెండేండ్లుగా ఎదురుచూపు..: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు మధ్యలో నిలిచిపోయింది. రెండేండ్ల కిందటే దాదాపుగా అన్నీ పనులను అప్పటి ప్రభుత్వం పూర్తిచేసింది. అయినా ఎకో పార్క్ ప్రారంభానికి నోచుకో లేదు. రేవంత్‌సర్కారు ప్రజా సేవ కంటే రాజకీయాలు, ప్రచారాలకే ప్రాధాన్యతనిస్తున్నది. నగరవాసుల కోసం నిర్మించిన అంతర్జాతీయ స్థాయి పార్కును కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తుందనే అభిప్రాయం ప్రజల్లోఉంది. ప్రభుత్వ అసమర్థతతో రెండేండ్లు గడిచినా అందుబా టులోకి రావడం లేదు. ప్రజాసౌకర్యాలు, అవసరాలు, అభివృద్ధి పనులు ప క్కనబెట్టి, హైదరాబాద్ ప్రతిష్టను పెంచే ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నది. కాంగ్రెస్ పాలన తీరుకు కొత్వాల్‌గూడ ఎకో పార్క్ సాక్ష్యంగా నిలుస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# అయ్యో..రొయ్య!



**- 70 వేల టన్నుల సరుకు బ్లాక్**
**- ఎగుమతిదారులు విలవిల**

**విశాఖ,తెలంగాణ దిశ:**విశాఖ జిల్లా ఆనందపురంలోని సముద్ర ఉత్పత్తుల (రొయ్య) ఎగుమతిదారీ సంస్థ స్ప్రింట్ గతంలో రోజుకు 40 టన్నులను అమెరికాకు ఎగుమతి చేసేది. ప్రస్తుతం 15 టన్నులకు అది పడిపోయింది. గతంలో నెలకు ఇక్కడి నుంచి 50 కంటైనర్ల రొయ్యలు అమెరికాకు వెళ్లేవి. ప్రస్తుతం 20కి పడిపోయాయి. మరో సంస్థ రొయ్యల ఎగుమతి టర్నోవర్ 2023-24 మధ్య కాలంలో రూ.500 కోట్లు ఉండగా 2024 సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకూ రూ.150 కోట్లకు పరిమితమైంది. రొయ్యల ఎగుమతులపై 50 శాతం అమెరికా సుంకాలు విధించడంతో ఆ దేశానికి ఎగుమతులు తగ్గించుకుంటున్నా మంటూ సంబంధిత ఎక్స్‌పోర్టర్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. రాష్ట్రంలోని ఏ సముద్ర ఉత్పత్తుల ఎగుమతి సంస్థను కదిపినా ఇదే ఆవేదన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోని రొయ్యల ఉత్పత్తుల ఎగుమతి సంస్థలు 40 నుంచి 45 వరకూ ఉన్నాయి. సెప్టెంబర్ నుంచి వీటికి దెబ్బమీద దెబ్బ పడుతూనే ఉంది. విశాఖ జిల్లాలో పది ఎగుమతి సంస్థలు ఉన్నాయి. వేల టన్నుల సరుకు బ్లాక్ అయిపోవడంతో టర్నోవర్‌పై తీవ్ర ప్రభావం పడిందని, కొత్త మార్కెట్లను వెతుక్కుంటున్నప్పటికీ సంక్షోభం నుంచి బయటపడే మార్గం కానరావడం లేదని ఆ సంస్థల నిర్వాహకులు వాపోతున్నారు. డిమాండ్ లేకపోవడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఇతర జిల్లాల్లోనూ రొయ్యల సాగు తగ్గించుకోవడం కూడా అష్టదిగ్బంధం విధించినట్టు అయ్యిందంటూ ఓ ఎగుమతి సంస్థ ప్రతినిధి తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మన దేశ రొయ్యల ఎగుమతులపై 50 శాతం సుంకాలను విధించిన ఫలితంగా సుమారు 70 వేల టన్నుల 'వెనామి' రకం రొయ్యలు ఎగుమతి కాకుండా బ్లాక్ అయ్యాయి. సుంకాల ప్రభావంతో సుమారు రూ.30 వేల కోట్ల మేర టర్నోవర్ దెబ్బతిన్నట్లు ఎగుమతిదారులు తెలిపారు. ప్రపంచంలో 40 శాతం రొయ్యలను భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి చేయడం ఆనవాయితీగా వస్తోంది. సెప్టెంబర్ తర్వాత అది 15 శాతానికి పడిపోయింది. ప్రపంచంలోనే టాప్ టెన్ ఇండిస్టీల్లో సముద్ర ఉత్పత్తులు ఒకటి. దీనిలో మన రాష్ట్రమే ఎగుమతుల్లో అగ్రగామి. అమెరికా సుంకాల వల్ల జపాన్, చైనా, ఈక్వెడార్ ప్రాంతాలకు తమ ఎగుమతుల వ్యాపారాన్ని విస్తరించేందుకు ఎగుమతి సంస్థలు చేస్తోన్న ప్రయత్నాలు ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉన్నాయి. అమెరికాకు కాకుంటే ప్యాకేజీ మార్చాల్సిందే!: ప్యాకింగ్‌ల సమస్య తలెత్తుతోందని సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ తాజాగా చెబుతున్నారు. ప్యాకింగ్ విధానాన్ని ఒక్కో దేశం ఒక్కో రీతిలో కోరుకుంటుంది. అమెరికాకు ఎగుమతి చేసే ఉద్దేశంతో ఇప్పటికే సుమారు 70 వేల టన్నుల ప్యాకింగ్ పూర్తయింది. అయితే, సుంకాల పెంపుతో ఈ సరుకంతా బ్లాక్ అయిపోయింది. దీంతో, అమెరికాకు కాకుంటే ప్యాకింగ్ మొత్తం మార్చాల్సి ఉంది. అంతేగాక ఈ దేశాల అవసరం మొత్తం కలిపినా అమెరికా ఇది వరకూ మన రాష్ట్రం నుంచి అయ్యే దిగుమతులకు చేరుకునే పరిస్థితి లేదని సముద్ర ఉత్పత్తుల ఎగుమతి సంస్థలు తలలు పట్టుకుంటున్నాయి.

# అణు విద్యుత్ రంగంలోకి ప్రవేశిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టీపీసీ

**- ఏపీ, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాల అన్వేషణ**
**- 2047 నాటికి 30 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తి సాధించాలని లక్ష్యం**
**- ఒక గిగావాట్ ప్లాంటుకు రూ.20,000 కోట్ల వరకు పెట్టుబడి అంచనా**
**- యురేనియం కోసం దేశీయ, విదేశీ వనరులపై ప్రత్యేక దృష్టి**




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థఅయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) అణు విద్యుత్ రంగంలోకి భారీ ప్రణాళికలతో ప్రవేశిస్తోంది.దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 700,1000,1600 మెగా వాట్లసామర్థ్యంతో అణు విద్యుత్ ప్రాజెక్టులను స్థాపించడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను అన్వేషిస్తున్నట్లు సంస్థ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్‌బీ) అనుమతించిన ప్రాంతాల్లోనే ఈ ప్లాంట్లను నిర్మించనున్నారు. 2047 నాటికి దేశంలో 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా, ఎన్‌టీపీసీ 30 గిగావాట్ల వాటాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఒక గిగావాట్ సామర్థ్యం గల అణు విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి సుమారు రూ.15,000 కోట్ల నుంచి రూ.20,000 కోట్ల వరకు పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. ప్రాజెక్టు ప్రణాళిక దశ నుంచి ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడేళ్ల సమయం పడుతుందని సంస్థ భావిస్తోంది.

ఈ ప్లాంట్లకు అత్యంత కీలకమైన ముడిపదార్థం యురేనియం సమీకరణపై ఎన్ టీపీసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకోసం యురేని యం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో వాణిజ్య, సాంకేతిక ఒప్పందం కుదుర్చుకుంది. అంతేకాకుండా, విదేశాల్లోనూ యురేనియం ఆస్తుల సమీకరణకు ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం ఎన్‌టీపీసీకి దేశవ్యాప్తంగా బొగ్గు, గ్యాస్, సౌర, జల విద్యుత్ ప్లాంట్ల ద్వారా 84,848 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉంది. ఇదివరకే రాజస్థాన్‌లో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్‌తో కలిసి రూ.42,000 కోట్లతో ఓ అణు విద్యుత్ ప్లాంటును నిర్మిస్తోంది.

# పర్యాటక శాఖలో భారీగా ఉద్యోగాలు!

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ పర్యాటక రంగం చరిత్రలోనే తొలిసారిగా రూ. 13,819 కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించింది. ఈ నిధులు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా దేశీయ, అంతర్జాతీయ డెవలపర్ల నుంచి వచ్చాయి. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 17,960 మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. వికారాబాద్, బుద్ధవనం, సోమశిల వంటి ప్రాంతాల్లో ఎకో, అడ్వెంచర్ టూరిజం ప్రాజెక్టులతో పాటు, హైదరాబాద్‌లో ఒబెరాయ్, సెయింట్ రెజిస్ వంటి లగ్జరీ హోటళ్లు ఏర్పాటు కానున్నాయి.తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు పర్యాటక రంగంలో అంతర్జాతీయ గమ్యస్థానంగా రూపుదిద్దుకోబోతోంది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత టూరిజం రంగంలో ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు రావడం ఇదే మొదటిసారి. దేశీయ, అంతర్జాతీయ డెవలపర్ల నుంచి రూ. 13,819 కోట్ల భారీ పెట్టుబడులు ఆకర్షించినట్లు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రకటించింది. ఈ పెట్టుబడుల ద్వారా 17,960 మందికి పైగా ఈ రంగంలో ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి కొత్త బాటలు పడుతున్నాయి.ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే 14 ప్రాజెక్టులకు గాను రూ. 7,081 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీని ద్వారా సుమారు 8,920 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. అలాగే.. పూర్తిగా ప్రైవేట్ భాగస్వామ్యంతో 17 ప్రాజెక్టులు చేపట్టేందుకు డెవలపర్లు ముందుకు రాగా.. రూ. 6,738 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపారు.

ఈ ప్రాజెక్టుల ద్వారా 9,040 ఉద్యోగాలు కల్పించనున్నారు. హైదరాబాద్‌తో పాటు వికారాబాద్, నాగార్జున సాగర్, బుద్ధవనం, అమరగిరి, సోమశిల, అమ్రాబాద్ తదితర ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఈ పెట్టుబడులు కేంద్రీకృతమవుతున్నాయి.ఎకో, అడ్వెంచర్ టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నా రు. ట్రెక్కింగ్, సఫారీ, ఫారెస్ట్ రిసార్టులు ఏర్పాటు కానున్నాయి. మేఘా ఇంజనీరింగ్ సంస్థ అనంతగిరి హిల్స్‌లో 81 ఎకరాల్లో రూ. 1,021 కోట్లతో లగ్జరీ 'లా వీ వెల్‌నెస్ రిట్రీట్'ను నిర్మిస్తున్నది. బుద్ధవనంలో వెడ్డింగ్, వెల్‌నెస్ సెంటర్లు అభివృద్ధి చేస్తున్నారు. మహాబోధి సొసైటీ, థైవాన్ ఫోగువాంగ్ షాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు కూడా ఇక్కడ బుద్ధిస్ట్ మిషనరీ మెడిటేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేయనున్నాయి.

కృష్ణా నది బ్యాక్‌వాటర్‌లోని సోమశిలను డెస్టినేషన్ వెడ్డింగ్స్ , అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు.రామోజీ గ్రూప్ రామోజీ ఫిల్మ్ సిటీలో 600 ఎకరాల్లో కొత్త టూరిజం ఆకర్షణల కోసం రూ. 2,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నది. సినిమా పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ, మాస్టా స్టూడియోస్ రూ. 550 కోట్లతో 'బాహుబలి థీమ్ పార్క్‌ను' నిర్మించనున్నది. హైదరాబాద్ నగరం కూడలగ్జరీ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల హబ్‌గా మారుతోంది. ప్రెస్టీజ్ గ్రూప్ రాయదుర్గంలో ఒబెరాయ్‌తో 5-స్టార్ హోటల్ , బుద్వెల్‌లో సెయింట్ రెజిస్ హోటల్ వంటి అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్‌లతో ప్రాజెక్టులు చేపడుతున్నది. శంషాబాద్‌లో సిటాడెల్ హోటల్స్‌రూ. 500 కోట్లతో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తుండగా.. నియోపోలీస్‌లో బ్రిగేడ్ గ్రూప్ ద్వారా ఇంటర్‌కాంటినెంటల్ హోటల్ రాబోతోంది. ఈ భారీ పెట్టుబడులతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరడమే కాకుండా.. రాష్ట్రం పర్యాటక రంగంలో ప్రపంచ పటంలో కీలక స్థానం సంపాదించనుంది

# అన్నవరంలో తిరుమల తరహా సేవలు


**కాకినాడ,తెలంగాణ దిశ:** తిరుమల తరహాలోనే అన్నవరం సత్యదేవుని ఆలయంలో నూ భక్తులకు సేవ చేసే అవకాశం కల్పిస్తున్నారు. కార్తీక మాసం సందర్భంగా 5,225 మందికి పైగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రతిరోజూ సుమారు 200 మంది వాలంటీర్లు అన్నదానం, క్యూలైన్ల నిర్వహణ వంటి పనుల్లో తోడ్పడుతున్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునేవారు ఆలయ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.తిరుమల శ్రీవారి ఆలయం, అనుబంధ ఆలయాల లో భక్తులు సేవ చేసే అవకాశం కల్పిస్తోంది టీటీడీ. ఇదే తరహాలో రాష్ట్రంలో ప్రధాన ఆలయాల్లో కూడా సేవకు అవకాశం కల్పిస్తోంది. అన్నవరం సత్యదేవుని ఆలయంలో కూడా సేవలందించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఏకంగా 5,225 మంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం విశేషం. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ప్రతిరోజూ సుమారు 200 మంది వాలంటీర్లు సేవలు అందిస్తున్నారు. భక్తులు 25, 50, 100 మందితో బృందాలు గా ఏర్పడి సేవలు అందిస్తున్నారుఈ వాలంటీర్ల సేవలు అన్నవరం ఆలయ నిర్వహణకు ఎంతో తోడ్పడుతున్నాయి. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో వీరి పాత్ర కీలకం. అధికారులు వీరిని ఆలయ ప్రధాన సేవలు, అన్నదానం, భక్తులకు మంచినీటి సరఫరా, క్యూలైన్లలో సేవలందించేందుకు కేటాయిస్తున్నారు. బృందాలుగా ఏర్పడిన వాలంటీర్లకు వారి విధుల గురించి ముందుగానే తెలియజేస్తు న్నారు. రోజువారీ పనులు, భక్తుల రద్దీ, పండుగల సమయంలో అవసరమయ్యే వాలంటీర్ల సంఖ్యను అధికారులు అంచనా వేసి, ఆ మేరకు వారికి సమాచారం అందిస్తారు. దీనివల్ల సేవా కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో సేవకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.అన్నవరం సత్యదేవుడి ఆలయంలో భక్తులకు సేవ చేయాలనుకునే



సేవకులు ఆలయం వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆసక్తి ఉన్న తెలుగు రాష్ట్రాల భక్తులు వెంటనే.. వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అక్కడ ఆప్షన్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకుంటే సరిపోతుంది. 'భక్తులు సేవ పేరు, ఎన్ని రోజులు, బృందాలుగా, వ్యక్తిగతంగా సేవ చేస్తారా, ఎందరు సభ్యులు, అన్నదానం, రద్దీ' తదితర అంశాలు.. ఎక్కడ సేవ చేయాలనుకుంటున్నారో కూడా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. టీమ్ ప్రతినిధి ఫోటో, ఐడీ కార్డు, పేరు, డేట్ ఆఫ్ బర్త్, వయసు, మొబైల్ నంబర్, ఫిట్‌గా ఉన్నారా లేదా, అడ్రస్ వంటి పూర్తి వివరాలు నమోదు చేయాలి. టీమ్‌లుగా సేవ చేయాలనుకుంటే కనుక.. టీమ్ సభ్యుల పేర్లు, వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. భక్తులు నమోదు చేసిన వివరాలు పరిశీలించిన అనంతరం ఆలయ గుర్తింపుకార్డు అందజేస్తారు. భక్తులకు సేవ చేయాలనుకునే సేవకులు నేరుగా ఆలయానికి వచ్చి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలియజేశారు. భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అన్నవరం మాత్రమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన ప్రధాన ఆలయాల్లో కూడా ఇలాగే సేవకులుగా సేవ చేసేందుకు భక్తులు ముందుకు వస్తున్నారు.

# వైజాగ్ కు ఐటీ కంపెనీల క్యూ

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:** విశాఖపట్నం ఐటీ హబ్‌గా, ఏఐ సిటీగా రూపుదిద్దుకుం టున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. గూగుల్, టీసీఎస్ వంటి సంస్థలు రాకతో నగరంలో స్థిరాస్తికి డిమాండ్ పెరిగింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో పెట్టుబడులు ఆకర్షిస్తున్నాయి. ఈ నెలల్లో వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025 స్థిరాస్తి రంగంపై అవగాహన కల్పించనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగరతీర నగరం విశాఖపట్నంపై ఫుల్ ఫోకస్ పెట్టింది. నగరాన్ని ఐటీ హబ్‌గా, ఏఐ సిటీగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గూగుల్, టీసీఎస్ కాగ్నిజెంట్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలతో పాటుగా మరొకిన్ని సంస్థలు విశాఖపట్నంలో కంపీనలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. మరికొన్ని ఐటీ కంపెనీలు కూడా విశాఖపట్నంవైపు చూస్తున్నారు. గత నెలలో గూగుల్ డేటా సెంటర్ ఎంవోయూతో విశాఖపట్నం దశ తిరిగింది. విశాఖపట్నం కేంద్రం ఐటీ కంపెనీలు, పర్యాటక, సేవారంగ సంస్థలు త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభిం చనున్నాయి. ఈ క్రమంలో చాలామంది నగరంలో స్థిర నివాసం కోసం చూస్తున్నారు. నగరంలో రియల్ బూమ్ వచ్చింది.. స్థిరాస్తి రంగం కూడా నగరానికి అన్ని వైపులా విస్తరిస్తోంది. విశాఖపట్నంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతుండటంతో, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం కానుండటంతో, ప్రజలు స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికి స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్రలో నిర్మాణ రంగం పుంజుకుంది.. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. నగరంలో అన్ని ప్రాంతాల్లోనూ కొత్త నిర్మాణాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం అపార్టుమెంట్లలో పది వేలకు పైగా ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ.35 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నాయి. విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. సొంతంగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారి కోసం ఉత్తరాంధ్రలో 50 వేలకు పైగా ఖాళీ స్థలాలు సిద్ధంగా ఉన్నాయి. నరెడ్కో (జాతీయ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) గుర్తింపు పొందిన పలువురు బిల్డర్లు, అందుబాటు ధరల్లో గృహ సముదాయాలను నిర్మిస్తున్నారు.విశాఖపట్నంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025 పేరుతో ఒక ప్రత్యేకమైన స్థిరాస్తి ప్రదర్శన జరగనుంది. నరెడ్కో ఆధ్వర్యంలో గాదిరాజు ప్యాలెస్‌లో



జరిగే ఈ కార్యక్రమంలో, సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చే దేశ, విదేశీయులకు విశాఖపట్నం స్థిరాస్తి రంగంపై సమగ్ర అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాల ప్రాజెక్టుల వివరాలను పండగ వాతావరణంలో అందించనున్నారు. ఈ వైజాగ్ ప్రాపర్టీ ఫెస్ట్-2025లో భాగంగా, జీఎంఆర్ ఆధ్వర్యంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నమూనాను ఒక భారీ స్టాల్‌లో ప్రదర్శిస్తారు.అలాగే, భోగాపురం ఏరియా డెవలప్‌మెంట్ కింద ఆ పరిసర ప్రాంతాల్లోని స్థిరాస్తి ప్రాజెక్టులను కూడా పరిచయం చేస్తారు. వీఎంఆర్‌డీఏ, మెట్రో ప్రాజెక్టులకు కూడా ఈ ప్రదర్శనలో ప్రత్యేక స్థానం కల్పించారు. ప్రతి గంటకు లక్కీ డ్రాలు నిర్వహిస్తారు. ఈ డ్రాలలో బైకుల్ని బహుమతులుగా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ, యూబీఐ, ఎల్ఐసీ, బ్యాంకు ఆఫ్ బరోడా వంటి ప్రముఖ బ్యాంకులు పాల్గొంటున్నాయి. ప్రదర్శనలో 60కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు.ఈ ప్రదర్శన ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఇళ్లు మాత్రమే కాదు విశాఖపట్నంలో భూముల్ని కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే చాలామంది నగరంలో భూముల కొనుగోలు చేయగా.. మరికొందరు కొనుగోలు చేసే పనిలో ఉన్నారు. విశాఖపట్నంలోని గాజువాక, పెందుర్తి, భీమిలి, ఆనందపురం, మధువాడ, అక్కయ్యపాలెం వంటి చాలా ప్రాంతాల్లో భూములకు డిమాండ్ పెరిగింది. అలాగే నగరంలోని పలు ఫ్లాట్లు కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తానికి విశాఖపట్నంలో భూమి, ఫ్లాట్లు ఉంటే చాలు వాళ్ల పంట పండినట్లే.

# సినిమా..

## కొరియన్ భాషలో కూడా నటించాలనుందట..!

### హాట్ టాపిక్‌గా రష్మిక మందన్నా కామెంట్స్



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా కాంబోలో వచ్చిన చిత్రం థామా. హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన ఈ మూవీ అక్టోబర్ 21న విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. మరోవైపు ఇటీవలే తెలుగులో ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్న రష్మిక ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులు, ఫాలోవర్లతో షేర్ చేసుకుంది. తన ఫిల్మోగ్రఫీలో భిన్నమైన సినిమాలుండేలా ప్లాన్ చేసుకునే రష్మిక కొరియన్ సినిమా చేయడంపై అడిగిన ప్రశ్నకు స్పందించింది. అవును.. కొరియన్ డ్రామా చేయాలనుకుంటున్నా. అవి చాలా ఫన్‌గా ఉంటాయి. కానీ వాళ్లు (మేకర్స్) నాకు ఏం ఇస్తున్నారనే దానిపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే నేను స్క్రీన్‌పై ఏం చేయగలనో మీకు తెలుసు..
కథ నాకు సెట్ అవుతుందనిపిస్తే కొరియన్ ప్రాజెక్ట్ చేసేందుకు రెడీనంటూ చెప్పుకొచ్చింది. నాకు కొరియన్ సినిమాలపై ప్రేమ కోవిడ్‌టైంలోనే మొదలైంది. కోవిడ్ సమయంలో నా చేతిలో చాలా టైం ఉంది కాబట్టి కొరియన్ డ్రామాల గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ప్రతీ కొరియన్ డ్రామా 16 ఎపిసోడ్స్‌గా ఉంటుంది. అంటే మీరు ఒక కొరియన్ ప్రాజెక్ట్‌ను స్క్రీన్‌పై చూడాలంటే రోజులో 16 గంటలు కేటాయించవచ్చన్నది రష్మిక మందన్నా. ఈ కామెంట్స్‌తో ఇక రాబోయే కాలంలో కొరియన్ సినిమాలు కూడా చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని రష్మిక హింట్ ఇచ్చేస్తుంది.

## "ది రాజా సాబ్" ఫస్ట్ సింగిల్‌పై క్లారిటీ ఇచ్చిన నిర్మాత..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్-కామెడీ "ది రాజా సాబ్" చిత్రం పై అంచనాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ ఎప్పుడు వస్తుందన్న దానిపై అభిమానుల మధ్య పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై చివరికి నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఎస్‌కేఎన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫస్ట్ సింగిల్ విడుదలలో ఆలస్యం రావడానికి కారణం ఉత్తర భారత, తెలుగు మార్కెటింగ్ టీమ్‌ల మధ్య చర్చలు అని చెప్పారు. మొదటగా 'రెబెల్ సాబ్'అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను ముందుగా విడుదల చేయాలని అనుకున్నా, ఉత్తర భారత పంపిణీదారులు మాత్రం ముందుగా మెలోడి సాంగ్ రిలీజ్ చేయాలని సూచించారని తెలిపారు. ఈ భిన్నాభిప్రాయాల వల్లే చిన్న ఆలస్యం జరిగిందని అన్నారు. దక్షిణ భారత మార్కెట్లో సాధారణంగా లిరికల్ వీడియోలు మాత్రమే రిలీజ్ చేసి, పూర్తి సాంగ్ వీడియోలను థియేటర్స్‌లో చూపిస్తారని, కానీ ఉత్తర భారత మార్కెట్లో మాత్రం పూర్తి వీడియో సాంగ్స్ ముందుగానే విడుదల చేస్తారని ఎస్‌కేఎన్ వివరించారు. ఇందుకే ఆలస్యం జరిగుతుందని తెలియజేశారు. "ది రాజా సాబ్"లో ఐటెమ్ సాంగ్ ఉండదని, అయితే ఒక పాపులర్ హిందీ సాంగ్‌ను రీమిక్స్ వెర్షన్‌గా తీస్తున్నామని నిర్మాత తెలిపారు. ప్రతి సాంగ్ రిలీజ్ మధ్య 10–14 రోజుల గ్యాప్ ఇస్తారని, ఇలా చేయడం వల్ల ప్రేక్షకులు ప్రతి సాంగ్‌ను మంచి మ్యూజిక్ అనుభవంతో ఆస్వాదించగలరని చెప్పారు.
ఎస్‌కేఎన్ ప్రకారం, ఫస్ట్ సింగిల్ నవంబర్ మూడో లేదా నాలుగో వారంలో విడుదల కానుంది. ఆతర్వాత సినిమా ప్రమోషన్లు డిసెంబర్ చివరి వరకు కొనసాగుతా యి. ఈ క్రమంలో "ది రాజా సాబ్" ను 2026 జనవరి 9న, సంక్రాంతి సీజన్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి టీమ్ సన్నాహాలు చేస్తోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్‌రిద్ధి కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మొత్తానికి, "ది రాజా సాబ్" ఫస్ట్ సింగిల్‌పై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. నిర్మాత ఎస్‌కేఎన్ ఇచ్చిన తాజాఅప్‌డేట్‌తో అభిమానులు ఊరట చెందారు. మెలోడిసాంగ్ రూపంలో రాబోయేఈ ఫస్ట్ సింగిల్, ప్రభాస్ మ్యూజిక్ జర్నీకి కొత్త ఛాప్టర్‌గా నిలిచే అవకాశముంది.

## చాలా కాలం తర్వాత అసలైన రామ్ చరణ్‌ను చూశా




సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందిస్తూ తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆయన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌పైనా, యువ దర్శకుడు బుచ్చిబాబుపైనా ప్రశంసల వర్షం కురిపించారు. రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం నుంచి విడుదలైన 'చికిరి చికిరి' పాట సృష్టించిన సంచలనంపై వర్మ స్పందించారు. ఈ పాటలో చరణ్ నటనను, అతన్ని చూపించిన విధానాన్ని మెచ్చుకుంటూ తనఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "సినిమాలోని ప్రతి కళారూపం, ప్రతి విభాగం అసలు ఉద్దేశ్యం హీరోను మెరుగుపరచడమేచాలా కాలం తర్వాత రామ్ చరణ్‌ను తన అసలైన, సహజమైన, అద్భుతమైన రూపంలో చూశాను. 'చికిరి చికిరి' పాటలో చరణ్ ప్రదర్శించిన నటన, ఆవేశం, ఎనర్జీ నేను ఈ మధ్య కాలంలో చూసిన అత్యుత్తమ ప్రదర్శన" అని రామ్ గోపాల్ వర్మ కొనియాడారు. అంతేకాకుండా, దర్శకుడు బుచ్చిబాబును ఉద్దేశించి వర్మ ప్రత్యేకంగా ప్రశంసించారు. "ఒక స్టార్ తన చుట్టూ అతి తళుకుబెళుకుల మధ్య కాదు, సహజత్వంతో ఉన్నప్పుడే అత్యంత ప్రకాశవంతంగా కనిపిస్తాడు. నువ్వు ఆ విషయాన్ని అద్భుతంగా అర్థం చేసుకున్నావు.
భారీ సెట్స్, వందల మంది డ్యాన్సర్లు లేకుండా, అసలు దృష్టి మొత్తం హీరోపైనే నిలిపావు" అంటూ బుచ్చిబాబు దర్శకత్వ ప్రతిభను మెచ్చుకున్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నా యి. ఇటీవల ఏఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో విడుదలైన 'చికిరి చికిరి' పాట దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విడుదలైన కొన్ని గంటల్లోనే లక్షల వ్యూస్‌తో ట్రెండింగ్‌లోకి చేరి రామ్ చరణ్ పాన్-ఇండియా క్రేజ్‌ను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో రామ్ గోపాల్ వర్మ చేసినఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి.

## రష్మిక మూవీ గర్ల్‌ఫ్రెండ్ సక్సెస్ మీట్


### ముఖ్య అతిథిగా వస్తోన్న విజయ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన సూపర్ హిట్ చిత్రం ది గర్ల్ ఫ్రెండ్ సినిమాకు రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా.. దీక్షిత్ శెట్టి కథానాయకుడిగా నటించాడు. గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. వీకెండ్‌తో కాకుండా వీక్ డేస్‌లో కూడా ఈ చిత్రానికి హౌస్ ఫుల్ బోర్డులు కనిపించాయి. అయితే ఈ సినిమా సాధించిన విజయం పట్ల చిత్రబృందం నవంబర్ 12న సక్సెస్ మీట్ నిర్వహించబోతుంది. ఈ సక్సెస్ మీట్‌కు ముఖ్య అతిథిగా స్టార్ నటుడు విజయ్ దేవరకొండ రాబోతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఈ వేడుక మరింత గ్రాండ్‌గా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఎంగేజ్‌మెంట్ తర్వాత రష్మిక, విజయ్ ఒకేసారి వేదిక మీద కనిపించబోతుండటంతో ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గర్ల్ ఫ్రెండ్ సినిమా కథ విషయానికి వస్తే.. భూమా (రష్మిక మందన్న) పీజీ చేయడానికి హైదరాబాద్ లోని ఓ కాలేజ్ లో జాయిన్ అవుతుంది. అదే కాలేజ్ లో పీజీ చేయడానికి వచ్చిన విక్రమ్ (దీక్షిత్ శెట్టి) భుమాని చూసి ఇష్టపడతాడు. భూమా కూడా విక్రమ్‌ని ఇష్టపడుతుంది. విక్రమ్ కి జెలసీ, పోసిస్సివెన్స్ ఎక్కువ. తనది పాత కాలం మనస్తత్వం. విక్రమ్ తో రోజులు గడుపుతున్నకొద్ది భూమాకి కొన్ని విషయాలు అర్థమవుతూ వస్తుంటాయి. రిలేషన్షిప్ లో ఓ చిన్న బ్రేక్ కావాలని ఆడుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది?విక్రమ్ ఎలా రియాక్ట్ అయ్యాడు? ఈ కథలో దుర్గా (అను ఇమ్మానుయేల్) పాత్ర ఏమిటి? చివరికి భూమా ఎలాంటి నిర్ణయం




తీసుకుందనేది మిగతా కథ.

## శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదు..



మహిళలశరీరాకృతి ఎప్పుడూ ఒకేలాఉండదని,ఐదేళ్లకు ఓసారి మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ నటి తమన్నా భాటియా పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఒకే శరీరాకృతితో కనిపించలేమని ఆమె వివరించారు. బరువు తగ్గేందుకు ఇంజెక్షన్లు వాడుతున్నారంటూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పదిహేనేళ్ల వయసు నుంచే తాను నటిస్తున్నానని తెలిపారు. అప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, సినిమాల్లోని పాత్రల కోసం ఒక్కోసారి బరువు పెరగడం, మరోసారి తగ్గడం చేయాల్సి వస్తుందని తమన్నా వివరించారు. చిన్న వయసులోనే సినిమాల్లోకి వచ్చానని, కెమెరాతో తన ప్రయాణం సాగుతోందని చెప్పారు. ఇందులో దాచిపెట్టడానికి ఏమీలేదన్నారు. చిరంజీవి సినిమాలో ఐటెం సాంగ్..!: ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన 'కావాలయ్య', 'డా డా డాస్' వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. చిరంజీవి లేటెస్ట్ మూవీ 'మన శంకర వరప్రసాద్ గారు'లో స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని సమాచారం.

## ఫిక్షనల్ క్రైమ్ డ్రామా కాంత

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ కాంత. సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోంది. రానా కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది దుల్కర్ సల్మాన్ టీం. కాంతను ముందుగా లక్కీభాస్కర్‌తోపాటు షూట్ చేయాలనుకున్నాం. ఫస్ట్ లుక్ టెస్ట్ పూర్తి చేసినప్పుడు ఇద్దరు డైరెక్టర్లు అక్కడే ఉన్నారు. ఇద్దరు డైరెక్టర్ల టీమ్స్ కూడా రెండు లుక్స్‌లో ఉన్న కామన్ థింగ్‌ను కనుగొనేందుకు ప్రయత్నించాయి. కాంతలో 80స్ పీరియాడిక్ లుక్‌లో మారిపోవాల్సి ఉంటుంది. మీరు ఈ రెండు లుక్స్ కూడా సరిపోల్చుకోవచ్చు. కాంతలో క్లీన్ షేవ్ లుక్‌లో కనిపించాల్సి రావడంతో అది సాధ్యం కాలేదు. కాంత ప్రొడక్షన్స్ పనుల్లో ఆలస్యం కూడా దీనికి ఒక కారణమంటూ చెప్పుకొచ్చాడు దుల్కర్ సల్మాన్. ఇండియన్ యాక్టర్, సినిమాటిక్ సింగర్‌గా పాపులర్ అయిన ఎంకే త్యాగరాజ భగవతార్ ప్రయాణం స్ఫూర్తిగా సాగే ఫిక్షనల్ క్రైం డ్రామా అని అన్నాడు దుల్కర్ సల్మాన్. అంతేకాదు కాంత సాధారణ పీరియాడిక్ డ్రామా కాదని.. మోడ్రన్ సినిమా చూసిన అనుభూతిని ఇస్తుందని చెప్పారు రానా, దుల్కర్ సల్మాన్. ఇప్పటికే కాంత మూవీ నుంచి చేసిన అమ్మాడివే సాంగ్, రేజ్ ఆఫ్ కాంత ట్రాక్ సినిమాలపై హైప్ క్రియేట్ చేస్తున్నాయి. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215